




# విజయభాను






విశాఖపట్నం, మంగళవారం 19-11-2019 VIJAYABHANU DAILY ⁕ VISAKHAPATNAM సంపుటి : 43 సంచిక : 61 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## కలిసి నడుద్దాం... అన్నీ చర్చిద్దాం



న్యూఢిల్లీ: ఈ ఏడాదిలో ఇదే పార్లమెంటు చివరి సమావేశమైనందున శీతాకాల సమావేశాలు సజావుగా సాగేందుకు అంతా సహకరించాలని విపక్షాలను ప్రధాని మోదీ కోరారు. సోమవారంనాడు సమావేశాలు ప్రారంభానికి ముందు పార్లమెంటు వద్ద మీడియాతో మోదీ మాట్లాడుతూ, గత కొద్ది రోజులుగా దాదాపు అన్ని రాజకీయ పార్టీల నేతలను కలుసుకునే అవకాశం తనకు కలిగిందని, గత పార్లమెంటు సమావేశాలు అద్భుతరీతిన జరిగాయని, అందరు ఎంపీలు తరువాయి 2లో..

### సుప్రీం ప్రధాన న్యాయమూర్తిగా

## జస్టిస్ బోబ్డే ప్రమాణస్వీకారం



న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ శరద్ అరవింద్ బోబ్డే (63) ప్రమాణస్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో సోమవారం ఉదయం 9.30 గంటలకు జరిగిన కార్యక్రమంలో భారతదేశ 47వ ప్రధాన న్యాయమూర్తిగా ఆయన చేత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ప్రమాణస్వీకారం చేయించారు. ప్రదాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్‌షా, పలువురు కేంద్ర మంత్రులు ఈ ప్రమాణస్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇప్పటి వరకూ సీజేఐ పదవిలో తరువాయి 2లో..

### రైతు పంటలకు గిట్టుబాటుపై

# ప్రభుత్వ గ్యారంటీ



### అగ్రికల్చర్ మిషన్ వెబ్‌సైట్ ప్రారంభం

### మార్కెట్ ఇంటెలిజెన్స్‌పై సీఎం జగన్ సమీక్ష

అమరావతి: ఆంధ్రప్రదేశ్ స్టేట్ అగ్రికల్చర్ మిషన్ వెబ్ సైట్‌తో.. రికార్డుల పరంగా, ఇతర్రతా సమస్యలు ఏమైనా ఉంటే ఎప్పటికప్పుడు పరిష్కరించుకునే వెసులుబాటు ఉంటుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన అగ్రికల్చర్ మిషన్ వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. అనంతరం అగ్రిమిషన్‌పై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ మేరకు రైతు భరోసా ద్వారా వచ్చే మే నెల నాటికి మరింత మందికి లబ్ధి చేకూరుతుందని సీఎం వైఎస్ జగన్ తెలిపారు. ఇప్పటివరకూ 45,20,616 మంది కుటుంబాలకు చెందిన రైతులు రైతు భరోసా కింద లబ్ధి పొందారని తెలిపారు. సుమారు రూ.5,185.35 కోట్ల పంపిణీ చేశామని వెల్లడించారు. డిసెంబర్ 15 వరకూ కౌలు రైతులకు అవకాశం ఉంటుందని సీఎం వైఎస్ జగన్ తెలిపారు. దేవాలయాల భూములను సాగు చేసుకుంటున్న రైతులు, సొసైటీల పేరుతో సాగు చేసుకుంటున్న రైతులను కూడా రైతు భరోసా కింద పరిగణలోకి తీసుకోవాలని ఈ సమావేశంలో సీఎం వైఎస్ జగన్ నిర్ణయం తీసుకున్నారు. గ్రామ సచివాలయాల పక్కన దుకాణాలు, వర్క్‌షాపుల ఏర్పాటుపై సమీక్షలో పాల్గొన్న సీఎం వైఎస్ జగన్ మాట్లాడుతూ.. జనవరి తరువాయి 2లో..

## వెనుకబడిన వర్గాలకు ఉన్నత విద్య

### విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్



అమరావతి: వెనుకబడిన వర్గాల వారికి ఉన్నత విద్యను అందించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. సోమవారం ఆయన సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. పేద విద్యార్థుల కోసమే సీఎం వైఎస్ జగన్ ఇంగ్లీష్ మీడియం విద్యను ప్రవేశపెట్టారని చెప్పారు. గతంలో దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆరువేల పాఠశాలల్లో ఆంగ్ల విద్యను ప్రవేశపెట్టారని..ఇప్పుడు 61 శాతం మంది విద్యార్థులు ఇంగ్లీష్ మీడియం చదువుతున్నారని తెలిపారు. ఇంగ్లీష్‌పై పట్టులేక ఎంతో మంది ఉద్యోగవకాశాలను కోల్పోతున్నారని, పోటీ ప్రపంచంలో తట్టుకునే విధంగా వచ్చే ఏడాది నుంచి ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన అమలు చేయబోతున్నామని పేర్కొన్నారు. శాస్త్రీయ పద్ధతిలో ఇంగ్లీష్ మీడియం విద్యాబోధన తరువాయి 2లో..

## స్విస్ చాలెంజ్‌లో సింగపూర్ కంపెనీకి టెండర్లిచ్చారు

### మంత్రి బొత్స సత్యనారాయణ




అనంతపురం: పరస్పర అంగీకారంతోనే రాజధాని స్టార్టప్ ప్రాజెక్టు నుంచి సింగపూర్ కంపెనీ తప్పుకుందని మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. ఈ విషయాన్ని సింగపూర్ మంత్రి ఈశ్వరన్ స్వయంగా చెప్పారని, స్విస్ చాలెంజ్‌లో సింగపూర్ కంపెనీకి టెండర్లు ఇచ్చారన్నారు. మాతృభాషపై మమకారంతో పాటు మన మనుగడ, భృతి కూడా అవసరమన్నారు. తెలుగు తప్పని సరి చేశామని, మీడియం మాత్రమే ఇంగ్లీష్ చేశామని తెలిపారు. పేదలు తమ పిల్లలు కాన్వెంట్ స్కూళ్లకు వెళ్లాలనుకుంటున్నారని, ఇంగ్లీష్ మీడియం అమలుపై ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతున్నాయని మండిపడ్డారు.

ప్రతిపక్షాలకు ధైర్యముంటే ఇంగ్లీష్ మీడియం అక్కర్లేదని చెప్పాలని బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు.

## ఇసుక రవాణాపై పటిష్ట చర్యలు

### 14500 టోల్ ఫ్రీ నంబరు పారంభించిన సీఎం జగన్



అమరావతి : ఇసుక అక్రమ రవాణా, నిల్వ, అధిక ధరల విక్రయ నిరోధానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఇసుక రవాణాలో అవినీతిని ప్రజలు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చేందుకు 14500 టోల్ ఫ్రీ నంబరును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. అనంతరం టోల్ ఫ్రీ నంబరుకు కాల్ చేసి అక్కడ పనిచేస్తున్న అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కాల్ సెంటర్ ఉద్యోగులకు సీఎం జగన్ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తరువాయి 2లో..






## డిసెంబర్-20న ఎమ్మెల్యే గంటా ఆస్తుల వేలం!



విశాఖపట్నం: ఏపీ మాజీ మంత్రి, టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు చెందిన ఆస్తులను విశాఖలోని ఇండియన్ బ్యాంకు అప్పట్లో స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. గంటా శ్రీనివాసరావు హామీగా ఉన్న కంపెనీ కోట్లల్లో రుణం తీసుకుని చెల్లించకపోవడంతో ఆస్తులను బ్యాంకులు స్వాధీనం చేసుకున్నాయి. అయితే ప్రత్యూష రిసోర్సెస్ అండ్ ఇన్‌ఫ్రా ఆస్తుల వేలానికి బ్యాంక్ రంగం సిద్ధం చేసింది. డిసెంబర్ 20న వేలం వేస్తామని ఇండియన్ బ్యాంకు నోటీసులు జారీ చేసింది. కాగా.. భారీగా రుణం తీసుకుని ప్రత్యూష రిసోర్సెస్ అండ్ ఇన్‌ఫ్రా తిరిగి చెల్లించలేదని గంటా మంత్రి పదవి హోదాలో ఉన్నప్పట్నుంచి ఆరోపణలు వస్తూనే ఉన్నాయి. రుణగ్రహీతల జాబితాలో మాజీ మంత్రి గంటా శ్రీనివాస్ ఉన్నారు. ఇదిలా ఉంటే.. మొత్తం రుణం బకాయిలు రూ. 209 కోట్లు కాగా.. తనఖా పెట్టిన ఆస్తుల విలువ రూ. 35.35 తరువాయి 2లో..

## శివసేనకు ఎన్సీపీ షాక్..!

ముంబై: మహారాష్ట్ర ప్రభుత్వ ఏర్పాటులో ప్రతిష్టంభన వీడినట్లు కనిపించట్లేదు. రోజుకో మలుపు తిరుగుతూ.. ఉత్కఠ పరిణామాలకు దారి తీస్తోంది. ఎన్సీపీ, కాంగ్రెస్ పార్టీలతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని శివసేన ప్రకటించినా.. మూడు పార్టీలు కలిసి ఇప్పటి వరకు ఉమ్మడి ప్రకటన మాత్రం చేయలేదు. ఇదిలావుండగా మహారాష్ట్ర రాజకీయాలపై ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్ చేసిన వ్యాఖ్యలు పలు అనుమానాలకు తావిస్తోంది. ప్రభుత్వ ఏర్పాటుపై సోనియా గాంధీతో చర్చించేందుకు పవార్ సోమవారం ఢిల్లీ చేరుకున్న విషయం తెలిసిందే. అయితే వీరి భేటీకి ముందు జరిగిన మీడియా సమావేశంలో విలేకరులు ఆయనకు పలు ప్రశ్నలు సంధించారు. వాటికి పవార్ సమాధానం చెబుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో శివసేన-బీజేపీ కలిసి పోటీచేశాయి. ఎన్సీపీ, కాంగ్రెస్ కూటమిగా పోటీ చేశాయి. వాళ్ల రాజకీయాలు వాళ్లు చూసుకుంటారు. శివసేన దారి ఎటు వైపో వారే తేల్చుకోవాలి అంటూ ఆశ్చర్యకరమైన రీతిలో వ్యాఖ్యానించారు. ఇదిలావుండగా.. తాము ఎన్సీపీ, కాంగ్రెస్‌తో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని శివసేన ప్రకటించిన విషయం తెలిసిందే. దీనిపై పవార్ స్పందిస్తూ.. ఆ వార్తలు నిజమేనంటూ బదులిచ్చారు. దీంతో ఆయన మాటల్లో అర్థమేంటనేది అంతుపట్టలేదు. కాగా శివసేనతో కలిసి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తున్నామని, పూర్తి కాలంపాటు తాము తరువాయి 2లో..

# దుడ్డువీధిలో ఎమ్మెల్యే ధర్మశ్రీ పర్యటన



చోడవరం: పట్టణంలోని దుడ్డువీధి, వ్యాపారవీధి, ప్రేమ సమాజం రోడ్డులో వీధలలో స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ముఖ్యంగా మంచినీటి సమస్య, డ్రైనేజీ పూడిక తీత, వీధులలో వేలాడుతున్న ఎలక్ట్రికల్ వైర్లు తదితర సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అధికారులు తక్షణం సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో ఎం.పిడివో దుర్గా శ్యామ్ సుందర్, ఈవోపిఆర్డి చైతన్య, పంచాయతీ ఈవో లోవరాజు, వై.సిపి టౌన్ అధ్యక్షులు పుల్లేటి వెంకటరావు, జ్యోతుల రమేష్, ఓరుగంటి నెహ్రూ, బి.శ్రీరామమూర్తి, గూనూరు రామకృష్ణ,సకలా సూరిబాబు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### *నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి*

స్టీల్ ప్లాంట్ సి.ఎం.డిని కోరిన ఎమ్మెల్యే ధర్మశ్రీ

రూరల్ జిల్లా ప్రధాన కేంద్రంగా ఉన్న చోడవరం నియోజక వర్గం అభివృద్ధికి తమ వంతు సహాయసహాకారాలు అందించి సహకరించాలని విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ఛీఫ్ మేనేజింగ్ డైరెక్టర్‌ను చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ కోరారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో అతని మర్యా దపూర్వకంగా ఎమ్మెల్యే కలిశారు. ఈ సందర్భంగా స్టీల్ ప్లాంట్ ద్వారా చేపట్టే సామాజిక అభివృద్ధి కార్యక్రమాలను చోడవరం నియోజకవర్గంలో చేపట్టి నియేజకవర్గ అభివృద్ధికి సహకరించాలన్నారు. ఎమ్మెల్యేతో పాటు మాజీ సిడిసి ఛైర్మన్ దొండా రాంబాబు పాల్గొన్నారు.

## 20న చలో విజయవాడ

దేవరాపల్లి : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 25 వేల మంది గ్రామ రెవెన్యూ సహాయకుల న్యాయమైన డిమాండ్ల కు దేవరాపల్లి వి ఆర్ ఏ లు అంతా ఈ నెల 20న చలో విజయవాడ కార్యక్రమాలకు తరలిరావాలని వి ఆర్ ఏ సంఘం అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్ అప్పారావు, ఎస్ రమణమ్మ, పిలుపునిచ్చారు. సందర్భంగా వారు మాట్లాడుతూ, వీఆర్ఏలకు కనీస వేతనం 18వేలు ఇవ్వాలని,పే స్కేల్ అమలు చేయాలని, నామినీలు గా పనిచేస్తున్న వారసులను వి ఆర్ ఏ లుగా నియమించాలని ఇలా అనేక రకమైన డిమాండ్ల కోసం సంఘ సభ్యులంతా చలో విజయవాడ కార్యక్రమానికి తరలి రావాలని కోరారు.

**మొదటి పేజీ తరువాయి**

## సుప్రీం ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ బోబ్డే ప్రమాణస్వీకారం

ఉన్న జస్టిస్ రంజన్ గొగోయ్ ఆదివారం అధికారికంగా పదవీ విరమణ చేశారు. ఆయన స్థానంలో సీజేఐగా ప్రమాణస్వీకారం చేసిన జస్టిస్ బోబ్డే 2021 ఏప్రిల్ 23వ తేదీ వరకూ 17 నెలల పాటు పదవిలో ఉంటారు. అయోధ్యలోని వివాదాస్పద స్థలంలో రామాలయ నిర్మాణానికి మార్గం సుగమం చేస్తూ ఇటీవల చారిత్రక తీర్పునిచ్చిన ఐదుగురు సభ్యుల ధర్మాసనంలో జస్టిస్ బోబ్డే కూడా ఉన్నారు. గతంలోనూ ఆయన పలు కీలక తీర్పుల్లో పాలుపంచుకున్నారు. మహారాష్ట్రలోని లాయర్ల కుటుంబం నుంచి వచ్చిన జస్టిస్ బాబ్డే పేరును సీనియారిటీ ప్రాతిపదికపై రంజన్ గొగోయ్ ఇటీవల కేంద్రానికి సిఫారసు చేయగా, కేంద్రం సూచన మేరకు బాబ్డే అపాయింట్‌మెంట్ వారెంట్‌పై రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆమోదముద్ర వేశారు.

## రైతు పంటలకు గిట్టుబాటుపై ప్రభుత్వ గ్యారంటీ

1 నుంచి అమల్లోకి తీసుకువస్తామని తెలిపారు. దీనికి సంబంధించిన తగిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతుల కోసం ఏర్పాటు చేసే దుకాణాల్లో దొరికే ప్రతి వస్తువుకు ప్రభుత్వం గ్యారెంటీ ఇస్తుందని సీఎం వైఎస్ జగన్ తెలిపారు. వర్క్‌షాపులో రైతులకు ఏయే అంశాలకు శిక్షణ ఇవ్వాలన్నదానిపై ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు. భూసార పరీక్షలు వర్క్‌షాపులోనే పెడుతున్నామని ఆయన తెలిపారు. నేచురల్ ఫార్మింగ్‌పై రైతులకు అవగాహన కల్పించి.. గ్రామ సచివాలయాల్లో ఉన్న అగ్రికల్చర్ అసిస్టెంట్ల సేవలను బాగా వినియోగించుకోవాలని సీఎం వైఎస్ జగన్ సూచించారు. గ్రామ సచివాలయాల్లో ఏర్పాటు చేయదలచిన వర్క్‌షాపుల్లో వారి సేవలను వాడుకోవాలన్నారు. బయో ఫెస్టిసైడ్స్, బయో ఫెర్టిలైజర్స్ పేరిట జరుగుతున్న మోసాలను అరికట్టడానికి ఏపీ బయో ప్రొడక్ట్స్ రెగ్యులేటరీ యాక్ట్ తీసుకురావాలని ఆయన నిర్ణయం తీసుకున్నారు. దీనికి సంబంధించి తగిన చర్యలు తీసుకోవాలని సీఎం వైఎస్ జగన్ అధికారులను ఆదేశించారు. మార్కెట్ ఇంటెలిజెన్స్‌పై సమీక్ష నిర్వహించని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ పలు నిర్ణయాలు తీసుకున్నారు. గోడౌన్ల నిర్మాణంపై మండలాలు, నియోజకవర్గాల వారిగా మ్యాపింగ్ చేయాలని సీఎం వైఎస్ జగన్ అధికారులను ఆదేశించారు. రైతులు నష్టపోకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. వేరుశెనగ, మొక్కొజొన్నల కొనుగోలుకు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సీఎం వైఎస్ జగన్ అధికారులను ఆదేశించారు. కనీస మద్దతు ధరలేని చిరుధాన్యాలను సాగుచేస్తున్న రైతులను ఆదుకోవడానికి.. సాగుకు అవుతున్న ఖర్చును పరిగణలోకి తీసుకుని ఆమేరకు రాష్ట్ర ప్రభుత్వమే ధరలు ప్రకటిస్తుందని తెలిపారు. దీనిపై అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని సీఎం వైఎస్ జగన్ అధికారులను ఆదేశించారు. చిరుధాన్యాల ధరల ప్రకటన త్వరలోనే చేయానున్నట్టు తెలిపారు. చీనీ రైతులకు మంచి ధర వచ్చేలా చూడటానికి అనుసరించాల్సిన మార్కెటింగ్ వ్యూహాలపై సమీక్షించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న మార్కెట్ యార్డుల్లో కనీస సదుపాయాలు ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. మార్కెట్ యార్డులను నాడు-నేడు తరహాలో అభివృద్ధి చేయాలని తెలిపారు. పంటలకు వణ్యప్రాణుల నుంచి రక్షణ కల్పించడంపై సమగ్ర నివేదిక తయారుచేయాలని సీఎం వైఎస్ జగన్ అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో ఉప ముఖ్యమంత్రి పిల్లి సుభాష్ చంద్రబోస్, మంత్రులు కన్నబాబు, మోపిదేవి, బాలినేని పాల్గొన్నారు.

## కలిసి నడుద్దాం... అన్నీ చర్చిద్దాం

చురుకుగా పాల్గొనడమే అందుకు కారణమని అన్నారు. ఆ క్రెడిట్ కేవలం అధికార పక్షానికే కాకుండా మొత్తం పార్లమెంటుకే దక్కుతుందని ప్రశంసించారు. ఈ ఏడాది పార్లమెంటు చివరి సమావేశం ఇదేనని అన్నారు. రాజ్యసభ 250వ సమావేశం కావడం కూడా ఈసారి చాలా కీలకమని, భారత రాజ్యంగానికి 70 ఏళ్లు పూర్తయినందున రాజ్యాంగ దినోత్సవం కూడా జరుపుకోనున్నామని మోదీ పేర్కొన్నారు. శీతాకాల సమావేశాలకు ముందు జరిపిన అఖిలపక్ష సమావేశం విజయవంతమైందని, నిర్మాణాత్మకంగా జరిగిందని అన్నారు. సభలో అన్ని అంశాలపై నిష్కర్షగా చర్చ జరగాలని తాము కోరుకుంటున్నామని, నాణ్యమైన చర్చలు జరగడం చాలా కీలకమని, అలాంటి చర్చలతో పార్లమెంటు ప్రతిష్టను పెంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మోదీ కోరారు.

## ఇసుక రవాణాపై పటిష్ట చర్యలు

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సహానీ, డీజీపీ గౌతం సవాంగ్, టాస్క్‌ఫోర్స్ చీఫ్ సురేంద్ర బాబు తదితరులు హాజరయ్యారు.

ఇసుక అక్రమార్కులపై ఉక్కుపాదం మోపి, ఇసుక మాఫియాను అంతం చేసేందుకు సీఎం జగన్ ప్రభుత్వం కఠిన చర్యలకు సిద్ధమైన విషయం తెలిసిందే. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడ్డా, అధిక ధరలకు విక్రయించినా, పరిమితికి మించి కలిగి ఉన్నా నిందితులకు 2 సంవత్సరాల జైలు శిక్షతో పాటుగా రూ. 2 లక్షల వరకు జరిమానా విధించేలా మంత్రి వర్గం నిర్ణయం తీసుకుంది.

## వెనుకబడిన వర్గాలకు ఉన్నత విద్య

ఉంటుందన్నారు. మతం రంగు పూయడం దారుణం.. ఆంగ్ల బోధనపై మతపరమైన రంగు పూయడం దారుణమన్నారు. ఇంగ్లీష్ మీడియానికి, మతానికి సంబంధం ఏమిటని మంత్రి సూటిగా ప్రశ్నించారు. ఈ ప్రచారం వెనుక కుట్ర ఉందన్నారు. ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ తప్పుడు రాతలు రాస్తున్నారు. వారి పిల్లలు ఇంగ్లీష్ మీడియంలోనే చదివారు.. వారు మతం మారారా..? రెండు లక్షల మంది ఇంగ్లీష్ చదివి విదేశాలకు వెళ్ళారు.. వారు మతం మారారా.. అని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ముఖ్యమంత్రి గొప్ప మేలు చేస్తున్నారని.. కొంతమంది అది జీర్ణించుకోలేకపోతున్నారని ధ్వజమెత్తారు. మతానికి ముడి పెట్టే వారిని జాతి ఎప్పటికీ క్షమించదన్నారు. తప్పుడు ప్రచారం చేస్తున్న ఆంధ్రజ్యోతి రాధాకృష్ణపై చర్యలు తీసుకుంటామన్నారు. మతం పేరుతో చేసిన దుష్ప్రచారంపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని మంత్రి ఆదిమూలపు సురేష్ స్పష్టం చేశారు. అమ్మ ఒడి పథకంతో పేదలను విద్యకు దగ్గర చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

## డిసెంబర్-20న ఎమ్మెల్యే గంటా ఆస్తుల వేలం!

కోట్లు అని బ్యాంక్ అధికారులు నోటీసుల్లో పేర్కొన్నారు. మరి ఈ నోటీసులకు గంటా ఇంతవరకూ రియాక్ట్ కాలేదు.

## *శివసేనకు ఎన్సీపీ షాక్..!*

అధికారంలో ఉంటామని పవార్ ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా ఆయన చేసిన వ్యాఖ్యలు పలు సందేహాలను కల్పిస్తున్నాయి. ఢిల్లీలో ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. కాగా ప్రభుత్వ ఏర్పాటుపై సోనియాతో చర్చించిన అనంతరం ఇరు పార్టీలు ఓ ప్రకటన విడుదల చేస్తాయని తెలుస్తోంది.

# శివనామ స్మరణతో మారుమ్రోగిన శివాలయాలు



చోడవరం: పట్టణంలోని స్వయంభూ గౌరీశ్వరస్వామి ఆలయంతో పాటు మండలంలోని పలు శివాలయాలు సోమవారం శివనామ స్మరణతో మారుమ్రోగాయి. కార్తీక మాసం మూడవ సోమవారం కావడంతో తెల్లవారు జాము నుంచే కార్తీక స్నానాలు ఆచరించి, శివాలయాలకు చేరుకుని స్వామి వారిని దర్శించారు. ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచిలి గణేష్, చలపతిరావు విశేషపూజలు నిర్వహించారు. మండలంలోని రాయపురాజుపేట గ్రామంలోని కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో శివలింగార్చనలు నిర్వహించి మధ్యాహ్నం భక్తులకు భారీ అన్నదానం నిర్వహించారు. ముద్దుర్తి సంగమేశ్వరస్వామి ఆలయం వద్ద త్రివేణి సంగమం వద్ద పుణ్యస్నానాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకున్నారు. గోవాడ శివాలయం, గవరవరం కాశీ విశ్వేశ్వరాలయం, జుత్తాడ మల్లిఖార్జున స్వామి ఆలయంలలో విశేష పూజలు జరిపారు. వెంకన్నపాలెం కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి శివలింగాన్ని దర్శించుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని వనభోజన కార్యక్రమాలు కుటుంబ సమేతంగా నిర్వహించారు.

# సచివాలయాన్ని సందర్శించిన విదేశీ బృందం



చోడవరం: గ్రామ పంచాయతీ సచివాలయాన్ని 19 దేశాలకు చెందిన 23 మంది విదేశి బృందం సభ్యులు సోమవారం పర్యటించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ద్వారా గ్రామీణ ప్రాంతాలలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అధ్యయనం చేసేందుకు ఈ బృందం పర్యటించింది. వీరికి స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ సోదరుడు జయదేవ్, మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వరరావు, ఎఎంపిడివో దుర్గాశ్యామ్ సుందర్, ఈవోపిఆర్డి చైతన్య, పంచాయతీ ఈవో లోవరాజు, వై.సిపి నాయకులు సాదరస్వాగతం పలికి ప్రభుత్వ కార్యక్రమాలు వివరించారు.

## 13వాలంటరీ పోస్టులకు ఇంటర్వ్యూలు

దేవరాపల్లి : మండలంలోని మామిడిపల్లి,ముసిడిపల్లి, రైవాడ కాశీపురం, తెనుగుపూడి, కలిగొట్ల, బి.కింతాడ, దేవరాపల్లి, రెండో విడత గ్రామ వాలంటీర్ల13 పోస్టుల భర్తీకి ఆన్లైన్లో 123మంది దరఖాస్తు చేసుకున్నారని, ఎంపిడిఓ సిహెచ్ సుబ్బలక్ష్మి తెలిపారు. ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులకు సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూ లకు కేవలం 33 మంది మాత్రమే ఈ ఇంటర్వ్యూకు హాజరవడం జరిగిందని తెలిపారు. వీరిలో ఎవరు అర్హత సాధించారు అన్న విషయాలను త్వరలోనే వెల్లడిస్తానని ఆమె అన్నారు. ఈ ఇంటర్వ్యూలలో ఈ ఓ పి ఆర్ డి ఎం. రాధిక, ఎంజి ఎన్ అర్ జిఎస్ ఏపీఓ కే. తిరుపతిరావు, వెలుగు ఏపీఎం బి.డి. తిలక్, ఈ వాలంటరీ ఇంటర్వ్యూలు నిర్వహించారు.

# గ్రీన్ డెల్ లో స్టోరీ టెల్లింగ్ రూమ్ ప్రారంభం



మధురవాడ : మహా విశాఖ అయిదవ వార్డు పరిధి గ్రీన్ డెల్ ఇంటర్నేషనల్ స్కూల్లో స్టోరీ టెల్లింగ్ రూమ్ ని ప్రారంభించారు. అంతర్జాతీయ గుర్తింపు పొందిన ప్రముఖ ప్రఖ్యాత వ్యాసకర్త రోజర్ జన్ కిన్స్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల విద్య వికాసానికి స్టోరీ టెల్లింగ్ ఎంతగానో ఉపయోగపడుతుందని వారిలో ఉన్న భావాలను ఇతరులతో పంచుకోవడానికి సులభతరం అవుతుందని రానున్న రోజుల్లో దీని అవసరం అందరికీ ఉందని తెలిపారు అనంతరం విద్యాసంస్థల ఛైర్మన్ ఎస్. రవీంద్ర మాట్లాడుతూ భారతదేశంలో ప్రప్రధమంగా విశాఖలో గల గ్రీన్ డెల్ స్కూల్ లో ప్రారంభించుకోవడం చాలా ఆనందంగా ఉందని విద్యార్థులు చిన్నతనం నుండే స్టోరీ టెల్లింగ్నిఅల వరచుకోవడం వల్ల ప్రతి విషయంలోనూ చురుకుగా పరిస్థితులకు అనుగుణంగా రాణించగలరని ఆశాభావం వ్యక్తం చేశారు, ఇప్పటికే మా ప్రాంగణంలో ఆర్ట్ విలేజ్, రోబోటిక్స్, యోగా విలేజ్ లాంటివి ఉన్నాయని ఇప్పుడు సరికొత్తగా దీన్ని కూడా ప్రారంభించామని హర్షం వ్యక్తం చేశారు, ఈ కార్యక్రమం లో కరెపొందేంటీ డాక్టర్ ఎస్.విజయ, ప్రిన్సిపాల్ శారదా రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దీపికా దాస్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# వాలంటీర్లు ఎంపిక కోలాహలం



మధురవాడ : మహవిశాఖ జోన్ వన్ కార్యాలయం వద్దకు వాలంటీర్ల ఇంటర్వ్యూలకు అధిక సంఖ్యలో వచ్చారు, సరైన సమాచారం లేక గత శనివారం స్వల్పంగా హాజరవడం వలన ఎటువంటి ఇబ్బందులు లేకపోయినా, సోమవారం ఎక్కువ మంది రావడంతో అభ్యర్థులు అనేక ఇబ్బందులు పడ్డారు, గతంలో లాగనే ఐదు రూమ్ లలో అధికారులు ఇంటర్యూలు నిర్వహించారు, దీనితోపాటు ఈరోజు సోమవారం స్పందన కార్యక్రమం లో (ఇఇ)నరసింహారావు వినతులు స్వీకరించారు, ఇంజనీరింగ్ విభాగం కు రెండు, ప్రణాళిక కు రెండు, ఎపిడికి రెండు, ఆర్ ఒ కు ఒకటి మొత్తం పదకొండు వినతులు వచ్చినట్లు ఇఇ తెలిపారు, కార్యక్రమాలు లో ఎసిపి హరిదాసు, టిపిఒ రఘునాథ రావు, ఎఎమ్ హెచ్ ఒ డాక్టర్ జయరాం, అన్ని విభాగాల ఏఈ లు, సూపర్ వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రేమ సమాజంలో ఘనంగా పైలా శివతేజ జయంతి వేడుకలు



విశాఖపట్నం : జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. పైలా శివతేజ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పైల దివాకరరావు ఆధ్వర్యంలో సోమవారం జయంతి వేడుకలు నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేశారు. ఆనంతరం ప్రేమసమాజంలో వృద్ధులు, మహిళలకు చిన్నారులకు అన్నసమారాధన నిర్వహించి పండ్లు స్వీట్లు పంపిణీ చేశారు. అక్కడ నుంచి పాపా హోమ్ కు వెళ్లి అక్కడ చిన్నారులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించి చిన్నారుల మధ్య కేక్ కట్ చేసి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి

జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పక్కి దివాకర్, రవిరెడ్డి, నారా నాగేశ్వరరావు, కంపా హనోక్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పైలా శివతేజ ఫౌండేషన్ సేవలను కొనియాడారు. ప్రతి ఏటా శివ తేజ జయంతి వేడుకలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. అవగాహన ద్వారా రోడ్డు ప్రమాదాలను హలు మార్గాలు పంపతం. ఫౌండేషన్ సేవలను కొనియాడారు. ప్రతి ఏటా శివ తేజ జయంతి వేడుకలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. అవగాహన ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించగలమన్నారు. కార్యక్రమంలో శివతేజ తల్లిదండ్రులు దివాకర్,రమణి, కుటుంబ సభ్యులు జోష్ణ, జర్నలిస్టు మిత్రులు పాల్గొన్నారు.

# కార్యకర్తలంతా పార్టీకోసం కష్టపడి పనిచేయాలి



అనంతగిరి: మండల కేంద్రంలో సోమవారం నుండే కార్యకర్తలు సమాయత్తం కావాలని అరకు వేలి నియోజవర్గం తెలుగుదేశం పార్టీ నాయకులు సియ్యరి దొన్నదొర, పిలుపు నిచ్చారు. నియోజవర్గ మండల స్థాయి నాయకులు గ్రామ స్థాయి నాయకులు ప్రతి ఒక్కరు పార్టీ కోసం కష్టపడి పని చేయాలని తెలుగుదేశం పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్క కార్యకర్త సంసిద్ధం కావాలని సిపాయిలా అనునిత్యం కష్టపడి పనిచేయాలని సోమవారం అనంతగిరి కాఫీ హౌస్ లో నిర్వహించిన తెలుగుదేశం పార్టీ సమావేశంలో వారు అన్నారు అలాగే వైఎస్సార్ ప్రభుత్వం ప్రచార ఆర్భాటం తప్ప అభివృద్ధి శూన్యం అని వారు ఎద్దేవా చేసారు ఇసుక కొరతతో భవన కార్మికులు విలవిలలాడుతుంటే కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటున్న వైఎస్ఆర్ పార్టీ నాయకులు నిమ్మకునీరెత్తినట్లు ఉన్నారని కనీసం బలిగొన్న వారికి పరామర్శ కూడా చేయలేదని వారు అన్నారు,మన రాష్ట్రంలో అభివృద్ధికుంటుపడిందని వారన్నారు ఈ కార్యక్రమంలో అనంతగిరి మాజీ జెడ్పిటిసి కొట్యాడ అప్పారావు, తెలుగుదేశం పార్టీ నాయకులు, జన్ని అప్పారావు ,దొన్ను, అంటిపర్తిబుచ్చిబాబు, తడబరిక ఆనంద్ ,శిరగం రామునాయుడు, పుష్పానందం , జోగులు నియోజకవర్గ నాయకులు కమిడి సుబ్బారావు ,వంతల నాగేశ్వరరావు మరియుమండలంలోగల తెలుగుదేశంపార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు ,

# వైఎస్ఆర్ నవశకం పథకాలకు శ్రీకారం

## - ఎంపీడీఓ సిహెచ్ సుబ్బలక్ష్మి

దేవరాపల్లి : వై ఎస్ ఆర్ నవశకం పథకాలు అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి వర్తింపు చేసేవిధంగా చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ సిహెచ్ సుబ్బలక్ష్మి అన్నారు. ఈ విషయమై సోమవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులకు సచివాలయం నూతన ఉద్యోగులకు వైఎస్ఆర్ నవశకం పథకాలను గురించి తెలియజేశారు. వైఎస్సార్ పెన్షన్ కానుక, వైయస్సార్ కాపు నేస్తం, వైయస్సార్ ఆరోగ్యశ్రీ, జగనన్న విద్య వసతి, జగనన్న వసతి, అను పథకాలతో ప్రతి తెల్ల రేషన్ కార్డుదారులకు ఈ పథకాలు వర్తింప చేసే విధంగా ఒక్కొక్క పథకానికి ఒక్కొక్క కార్డు అర్హత కలిగిన లబ్ధిదారులకు అందించడం జరుగుతుందని, అందువలన పంచాయతీ కార్యదర్శులు తమతమ గ్రామంలో ఉన్న వాలంటీర్లు చేత రోజుకి 5 ఇల్లు చొప్పున సర్వే చేయించి ఆ కుటుంబంలో ఈ వైయస్సార్ నవశకం పథకాలలో వారు దీనికి అర్హత పొందిన ఉన్నారు. అని గుర్తించి వారికి ఆ అర్హత కలిగిన కార్డు ను అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈ ఓ పి ఆర్ డి ఎం. రాధిక, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం నూతన ఉద్యోగులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఎస్టీఐలో భూటాన్ అభ్యర్థులకు శిక్షణ ప్రారంభం



ఆరిలోవః గత మూడు సంవత్సరాలుగా ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ కు చెందిన తొమ్మిదివేల మంది నిరుద్యోగ యువతకు శిక్షణనిచ్చి వారిలో 80 శాతం మందికి ఉపాధి చూపించిన ఆరిలోవలోని స్కిల్ డెవలప్ మెంట్ ఇన్స్టిట్యూట్, సోమవారం నాడు మరొక కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. భూటాన్ దేశానికి చెందిన యువతకు పెట్రోలు బంకు ఆపరేటర్లుగా శిక్షణను అందించే కోర్సును సోమవారం నాడు హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ కు చెందిన జనరల్ మేనేజర్ కొల్లాటి శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. సంస్థకు చెందిన జనరల్ మేనేజర్లు రఘునాధన్, కే.నగేష్, విశాఖ క్షేత్రీయ అధిపతి రవి శంకర్, ఇతర అధికారులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్ ఆఫ్ భూటాన్ వారితో అనుసంధానమై ఆ దేశంలో పెట్రోలు బంకులు నిర్వహించడానికి హెచ్పీసీఎల్ వారు ముందడుగు వేశారని, వారికి కావలసిన మానవ వనరుల శిక్షణకై దూరాన్ని కూడా అధిగమించి, ఉత్తమ శిక్షణ అందించగలరనే నమ్మకంతో విశాఖలోని నైపుణ్యాభివృఇద్ధి సంస్థను ఎన్నుకోవడం జరిగిందని, దీని పురోగతిని బట్టి మరిన్ని కార్యక్రమాలు చేపడతామని అన్నారు. ఎస్డీఐ ముఖ్య కార్యనిర్వాహక అధికారి నగేష్ తమ ప్రసంగంలో భూటాన్ నుండి వచ్చిన అభ్యర్థులు, విభిన్నమైన తెలుగు భాషా, సంస్కృతులకు, ఆంధ్రుల ఆతిధ్యానికి తప్పక ఆకర్షితులవుతారని, 15 రోజుల శిక్షణను ఉత్సాహంతో పూర్తిచేసుకోవాలని అభిలషించారు. భూటాన్ నుండి హాజరైన 8 మంది అభ్యర్థులు, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

# 19 నుంచి 23 వరకు సత్యసాయిబాబా ఉత్సవాలు

విశాఖ సిటీః భగవాన్ శ్రీ సత్యసాయిబాబు 94వ జన్మదిన వేడుకలు ఈ నెల 19 నుండి 23 వరకు సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు సంస్థ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు, సిటీ సేవ సమితి కన్వీనర్ నాయుడు అన్నారు. 19న మహిళా దినోత్సవము, 20న సేవా దినోత్సవము, 21న యువజన దినోత్సవం, 22న బాలవికాస్ దినోత్సవం, 23న శ్రీ సత్యసాయిబాబా జన్మదినాన్ని పురస్కరించుకుని ఉదయం నుంచి రాత్రి వరకు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో రమణ తదితరులు పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయి అంశాలపై పరిశోధనలతోనే దేశ ప్రగతి



ఆంధ్ర విశ్వకళాపరిషత్ః క్షేత్రస్థాయి అంశాలపై విలువైన పరిశోధనలు చేస్తేనే దేశం మరింత ప్రగతి పథంలో పయనిస్తుందని ఆంధ్రాయూనివర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పేరి శ్రీనివాసరావు తెలిపారు. వర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాల గ్రంథాలయంలో సోమవారం ఉదయం ఎబ్స్కో రీసెర్చ్ డేటా బేసిస్, ఐఇఇఇ రీసోర్సెస్ అంశంపై డాక్టర్ వీఎస్.కృష్ణా లైబ్రరీ ఆధ్వర్యంలో ప్రత్యేక వర్కుషాప్ నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా ప్రిన్సిపాల్ ఆచార్య పేరి శ్రీనివాసరావు పాల్గొని ప్రసంగించారు. పరిశోధకులు, విద్యార్థులకు డిజిటల్ అంశాలపై మరింత పట్టు ఉండాలని సూచించారు. మారుతున్న దేశ అవసరాలకు అనుగుణంగా పరిశోధకుల్లో మరింత విషయనిపుణత ఉంటే అభివృద్ధి చెందుతారన్నారు. ఈ విషయంలో గ్రంథాలయాలు క్రియాశీలక పాత్ర పోషిస్తున్నట్టు గుర్తుచేశారు. ఎబ్స్కో బిజినెస్ మేనేజర్ శామ్యూల్ కిరణ్, రీజనల్ మేనేజర్ రాబీ మాథ్యూలు మాట్లాడుతూ ఇ బుక్స్, ఇ రీసోర్సెస్‌ల ప్రాధాన్యతలను వివరించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో సాంకేతికత విద్యార్థుల సంపూర్ణప్రగతిలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నట్టు గుర్తుచేశారు. డాక్టర్ వీఎస్.కృష్ణా లైబ్రరీ గౌరవ లైబ్రేరియన్ ఆచార్య కె.విశ్వేశ్వరరావు మాట్లాడుతూ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ప్రతి రోజు వివిధ అంశాలపై నిపుణులైన మేధావులతో విద్యార్థులు, పరిశోధకులు, సిబ్బందికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## యానాం గోదావరి లో స్థానానికి దిగి ఇద్దరు యువకులు గల్లంతు

యానాం : వృద్ధ గౌతమి గోదావరి నదిలో రాజమండ్రికి చెందిన ఇద్దరు యువకులు స్థానానికి దిగి గల్లంతయ్యారు స్థానిక బీచ్ రోడ్ లో గల జీసెస్ మెమొంటో సమీపంలోని గోదావరి నదిలో కొంతమంది యువకులు దిగి స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు నీలకూరి చంద్ర హాసన్ ( 20 ) కొప్పుల శేష సాయి పవన్ ( 19) ఈ ఇది ఇద్దరు యువకులు నదిలో మునిగి పోయారు దీంతో హృటా హుటాహుటిన పరిపాలన అధికారి శివరాజ్ మీనా , ఎస్పీ రచనా సింగ్, డిప్యూటీ తాసిల్దార్ సత్యనారాయణ ,సిఐ భక్తవత్సలం తదితరులు సంఘటన స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు పోలీసులు తెలిపిన వివరాలు రాజమండ్రి ఆర్ట్స్ కాలేజీలో చదువుతున్న కొంతమంది స్నేహితులు కలిసి సరదాగా యానాం వచ్చారని బొటానికల్ గార్డెన్ లో కొంతసేపు సరదాగా గడిపి యానం బీచ్ లో కొంత సేపు గడుపుతున్న తరుణంలో కొందరు వ్యక్తులు స్నానం చేయటం గమనించినయువకులు స్నేహితులతో కలిసి స్థానానికి గారు మరింత లోతుగా వెళ్లడంతో వారిని రక్షించేందుకు స్నేహితులు ఎంత ప్రయత్నించినప్పటికీ ప్రమాదవశాత్తు మునిగి పోయారు ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# నాన్ షెడ్యూల్ గ్రామాలన్నీ షెడ్యూల్ ఏరియాలో చేర్చాలి

## సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాధం



విశాఖ సిటీః విశాఖ జిల్లాలో నాన్ షెడ్యూల్ ఏరియా 8 మండలాల్లోని 282 గ్రామాలను షెడ్యూల్ ఏరియాలో చేర్చుతూ టిఎసి తీర్మానం చేయాలని సిపిఎం డిమాండ్ చేస్తుంది. ఈ గ్రామాలను షెడ్యూల్ ప్రాంతంలో చేర్చడం ద్వారా దాదాపు 50వేలకు పైగా గిరిజనులకు ప్రయోజనం కలుగుతుంది. సుదీర్ఘకాలం పోరాటం ఫలితంగానే నాన్ షెడ్యూల్ ఏరియా 8 మండలాల్లోని 91 గ్రామాలను షెడ్యూల్ ఏరియాలో చేర్చాలని గిరిజన సలహా మండలి (టిఎసి) ప్రతిపాదనను సిపిఎం విశాఖ జిల్లా కమిటీ స్వాగతిస్తున్నది. మిగిలిన 191 గ్రామాలను షెడ్యూల్ ప్రాంతంలో చేర్చుతూ తీర్మానం చేయాలని సిపిఎం కోరుతోంది. టిఎసి ప్రతిపాదించిన వాటిలో జిల్లాలోని 8 మండలాల పరిధిలో 91 గ్రామాలున్నాయి. జిల్లాలోని అనంతగిరి, నాతవరం, గొలుగొండ, దేవరాపల్లి, వి.మాడుగుల, రావికమతం, చీడికాడ, రోలుగుంట, కోటవురట్ల మొత్తం తొమ్మిది మండలాల పరిధిలోని 282 నాన్ షెడ్యూల్ గ్రామాలను షెడ్యూల్ ఏరియాగా గుర్తించాలనే డిమాండ్ దశాబ్దాలుగా కొనసాగుతోంది. 1970వ దశకం నుంచి షెడ్యూల్ ఏరియాలో చేర్చాలన్న డిమాండ్‌పై అనేకసార్లు గిరిజనులు ఆందోళనలు, నిరసనలు తెలియజేశారు. జిల్లాలో 282 గ్రామాలను షెడ్యూల్ ఏరియాగా ప్రకటించాలని డిమాండ్ వున్నప్పటికీ, 91 గ్రామాలకు ప్రతిపాదనలు పంపడం వల్ల మిగిలిన నాన్ షెడ్యూల్ గ్రామాల గిరిజనులకు అన్యాయం జరగనున్నది. ఉదాహరణకు అనంతగిరి మండలంలో 66 గ్రామాలుండగా కేవలం 32 గ్రామాలను మాత్రమే షెడ్యూల్డ్ ఏరియాలో కలుపుతున్నారు. మిగిలిన 8 మండలాల్లోను ఇదే విధంగా మిగిలిన గ్రామాల గిరిజనులకు కూడా నష్టం జరుగుతుంది. రాష్ట్ర ప్రభుత్వం 2011 జనాభా లెక్కల ప్రకారం నాన్ షెడ్యూల్డ్ గ్రామాలను గుర్తించి షెడ్యూల్ ఏరియాలో చేర్చుతూ తీర్మానం చేసినప్పుడు గిరిజనులకు న్యాయం జరుగుతుంది. టిఎసి ప్రతిపాదనలో కోటవురట్ల మండలంలోని గిరిజన గ్రామాలను పరిగణలోకి తీసుకోవాలి. ఈ మండలంలో 14 గిరిజన గ్రామాలున్నాయి. వీటిని షెడ్యూల్ ఏరియాలో చేర్చాలని గిరిజనులు కోరుతున్నారు. షెడ్యూల్ ప్రాంతంలో చేర్చడానికి అర్హత కలిగిన ఈ గ్రామాల్నీ షెడ్యూల్ ఏరియాలో చేర్చుతూ తీర్మానం చేసినప్పుడే 5వ షెడ్యూల్లో ఉన్న హక్కులన్నీ గిరిజనులకు అందుతాయి. 1/70, పీసా, అటవీహక్కుల చట్టం వంటి హక్కులతో పాటు ఐటిడిఎ ద్వారా అమలౌతున్న పథకాలన్నీ గిరిజనులకు లభిస్తాయి. ప్రభుత్వం న్యాయమైన గిరిజనుల డిమాండ్‌ను పరిష్కారించాల్సిందిగా సిపిఎం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతోంది.

# విద్యార్థులు సృజనాత్మకంగా పనిచేయాలి

## సమాజ అవసరాలకు పరిష్కారాలు చూపాలి

## ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పేరి శ్రీనివాస రావు



ఆంధ్ర విశ్వకళాపరిషత్ః విద్యార్థులు సృజనాత్మకంగా పనిచేయాలని ఏయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పేరి శ్రీనివాస రావు అన్నారు. సోమవారం ఉదయం తన కార్యాలయంలో హ్యాకథాన్ శీఘ్ర తంత్ర పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబరు 6,7 తేదీలో హ్యాకథాన్‌ను నిర్వహిస్తామన్నారు. సమాజ అవసరాలకు పరిష్కారాలు చూపే దిశగా విద్యార్థులు పనిచేయాలన్నారు. విద్యార్థుల మేధస్సుకు పదునుపెట్టే విధంగా హ్యాకథాన్ నిర్వహణ జరుగుతుందన్నారు.

హ్యాకథాన్ కన్వీనర్ ఆచార్య డి.లలిత భాస్కరి మాట్లాడుతూ ఆరు అంశాలపై ఈ పోటీ జరుగుతుందన్నారు. విద్యార్థులు సమస్యపరిష్కార సామర్ధ్యాలను ప్రస్ఫుటం చేసే దిశగా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 28వ తేదీలోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. బృందాలుగా విద్యార్థులు దీనిలో పాల్గొనాలన్నారు. 18 గంటలను నిర్విరామంగా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. పూర్తి సమాచారం క్సోం 9985630195, 8919165254 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ఆచార్య కుడ నాగేశ్వర రావు, ఆచార్య పి.మల్లికార్జున రావు, ఆచార్య రమాసుధ, ఆచార్య వాసుదేవ రెడ్డి, ఆచ్యా భాస్యర రెడ్డి, అన్నపూర్ణ, కె.వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

# డయల్ యువర్ కమిషనర్‌కు 21 ఫిర్యాదులు

## జివిఎంసి కమిషనర్ డా॥ జి. సృజన



విశాఖపట్నం: జివిఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్ (నెం.1800-4250-0009) కార్యక్రమానికి 21 ఫిర్యాదులు అందినట్లు జివిఎంసి కమిషనర్ డా॥ జి.సృజన పేర్కొన్నారు. 1వ జోన్ నుండి 7, రెండవ జోన్ 3, 3వ జోన్ 5, 4వ జోన్ 2, 5వ జోన్ 0, 6వ జోన్ 2, అనకాపల్లి 0, భీమిలి 0, పిడి యుసిడి 2 కాల్స్ అందాయి. సంబంధిత అధికారులు ఫిర్యాదులను స్వయంగా పరిశీలించి 3 రోజుల్లోగా నివేదిక సమర్పించాలని కోరారు.

# జివిఎంసి స్పందనకు 183 ఫిర్యాదులు

## జివిఎంసి కమిషనర్ డా॥ జి. సృజన



విశాఖపట్నం: జివిఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వ హించిన స్పందన కార్యక్రమానికి 183 ఫిర్యాదులు అందినట్లు జివిఎంసి కమిషనర్ డా॥ జి.సృజన తెలిపారు. ఇందులో ప్రధాన కార్యాలయానికి - 92, 1వ జోన్‌కు సంబంధించి 11, 2వ జోన్‌కు నిల్, 3వ జోన్‌కు నిల్, జోన్ 4కు సంబంధించి 12, జోన్-5కు 59, 6వ జోన్‌కు 6, అనకాపల్లి జోన్‌కు 3 ఫిర్యాదులు, భీమిలి జోన్‌కు నిల్ అందాయి.

స్పందనలో నమోదైన ఫిర్యాదులను తక్షణం పరిష్కరించాలని, అదేవిధంగా సదరు విషయాన్ని ఫిర్యాదుదారులకు తెలియజేయడంతో పాటు స్పందన రిజిష్టర్‌లో నమోదు చేయాలని పేర్కొన్నారు.

సంబంధిత అధికారులు ఫిర్యాదులను స్వయంగా పరిశీలించి 3 రోజుల్లోగా నివేదిక సమర్పించాలని కోరారు.

# డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమానికి 8 కాల్స్





విశాఖపట్నం : సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమానికి 8 మంది కాల్ చేసి తమ సమస్యలు తెలియజేశారు. ఎన్ ఏ ఓ బి ఎస్ డి సి శ్రీనివాస రెడ్డి ఫోన్ చేసిన వారికి సమాధానాలు ఇచ్చారు. రోలుగుంట మండలం అడ్డ పాలెం గ్రామం నుండి బొడ్డు శ్రీనివాస్ ఫోన్ చేసి తమ గ్రామంలో గిరిజనులకు పట్టాలు మంజూరు చేసిన భూములను 22 ఏ లో చూపించలేదని, స్పందన లో కూడా దరఖాస్తు ఇచ్చామని వెంటనే తగు చర్య తీసుకోవాల్సిందిగా కోరారు. నర్సీపట్నం నుండి శివ నారాయణ రాజు ఫోన్ చేస్తూ పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ లో దుకాణాలను తక్కువ ధరలకు అద్దెకు ఇస్తున్నారని, పట్నంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని ఫిర్యాదు చేశారు. విశాఖపట్నం ఏవిఎన్ కళాశాల ప్రాంతంనుండి బి ఈశ్వర్ రావు కాల్ చేసి మెడికల్ కాలేజీ ఖాళీ స్థలంలో చెత్త వేస్తున్నారని, ప్రజలకు చాలా ఇబ్బంది కరంగా ఉందని, జోనల్ కమిషనర్ గారు పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేశారు. రాంబిల్లి మండలం నుంచి జె. శ్రీనివాస్ మాట్లాడుతూ కొత్తూరు గ్రామంలో ఉన్న తమ భూములకు సంబంధించి రైతు భరోసా సొమ్ము ఇంకా తమకు అందలేదని చర్యలు తీసుకోవలసిందిగా అభ్యర్థించారు.

## పత్రికా ప్రకటన స్పందన కు782 దరఖాస్తులు

### స్పందన కు782 దరఖాస్తులు



విశాఖపట్నం : సోమవారం కలెక్టరేట్లో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 782 దరఖాస్తులు వచ్చినట్లు స్పందన డిప్యూటీ తాసిల్దార్ నాగరాజు తెలిపారు. జిల్లా కలెక్టరు వి.వినయ్ చంద్ వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జెసి 2 ఎమ్. వి. సూర్యకళ, జిల్లా రెవిన్యూ అధికారి, ఎం.శ్రీదేవి, ఆర్డీవో పి కిషోర్, జిల్లా పరిషత్ సీఈవో రమణ మూర్తి ప్రజల నుండి దరఖాస్తులు ఫిర్యాదులు స్వీకరించారు.

# ఇంజనీరింగ్ విద్యలో ఎన్‌సిసి ఇకపై తప్పనిసరి

## గీతం ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ధర్మరాజు



సాగర్‌నగర్ : విశ్వ విద్యాలయ నిధుల సంఘం ( యుజిసి ) నూతన నిబంధనల మేరకు ఇకపై గీతం విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కోర్సులు అభ్యసించే ప్రతీ విద్యార్థికీ ఎన్‌సిసి సిలబస్‌లో అంతర్భాగంగా ఉంటుందని గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి. ధర్మరాజు తెలిపారు. ఎన్‌సిసి కోర్సు సిలబస్‌పై అధ్యాపకులకు పునశ్చరణ తరగతులను సోమవారం ఆయన ప్రారంభించారు. విద్యార్థులకు ఎన్‌సిసితో పాటు యోగ, ఎన్ఎస్ఎస్‌కు సంబంధించిన అంశాలు బోధించడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం అధిక ప్రాధాన్యతను ఇస్తుందన్నారు. వ్యక్తిత్వ వికాసం, భారతీయ సంస్కృతి, సమాజం పట్ల బాధ్యత, శారీరక వ్యాయామం నేటి యువతలో అవసరం అని భావించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు. దాదాపు 50 మంది అధ్యాపకులకు ఈ శిక్షణ, పునశ్చరణ తరగుతుల నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గీతం ఎన్‌సిసి అధికారులు కెప్టెన్ బి. శ్రీనివాసరావు, డాక్టర్ పరిమళ వేణు తదితరులు పాల్గొన్నారు.

# పెసపల్లో ప్రపంచ పోటీలకు జిల్లా క్రీడాకారులు



విశాఖ సిటీః విశాఖపట్నం మహారాష్ట్రలోని పూణేలో ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు జరిగే పెసపల్లో ప్రపంచ కప్ పోటీలకు జిల్లా నుంచి 10 మంది క్రీడాకారులు ఎంపికయ్యారని ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రసన్న కుమార్ అన్నారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖ జిల్లా పెసిపల్లో అసోసియేషన్ ఎంపికైన క్రీడాకారులు జి. యేషన్, కె. రేష్మ, ఉమామహేశ్వరి, శార్వాణి, పి. కుసుమ కుమారి, ఉషారాణి, ప్రశాంతి, నిఖిత, కె. సుధీర్, పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ ఉద్యోగాలకు దరఖాస్తు లు ఆహ్వానం

### ఐ.సి.డి.ఎస్ అర్బన్ -1 ప్రాజెక్ట్ అధికారిణి ఎస్.పద్మవతి

కంచరపాలెం : ఐ.సి.డి.ఎస్ అర్బన్ -1 ప్రాజెక్ట్ అంగన్వాడీ కార్యకర్త మరియు అంగన్వాడి ఆయా పోస్టుల ఎంపిక కొరకు దరఖాస్తు లు ఆహ్వానిస్తున్నట్లు ఐ.సి.డి.ఎస్ అర్బన్ -1 ప్రాజెక్ట్ అధికారిణి ఎస్.పద్మవతి ఒక ప్రకటనతో తెలిపారు. వివిధ వార్డు లలో అంగన్వాడి కేంద్రాల వారీగా అంగన్వాడి కార్యకర్తలు 3 అంగన్వాడి ఆయాలు 21 పోస్టులను భర్తీ చేయుటకు తగిన అర్హతలు కలిగిన అభ్యర్థులు ధరఖాస్తు చేసుకోవచ్చునని సూచించారు . తేది: 19.11.2019 నుండి 27.11.2019 సాయంత్రం 5.00 గంటల లోపు మీ సేవ కేంద్రం ద్వార దరఖాస్తు చేసుకొనవలన్నారు . అంగన్వాడి కార్యకర్త అభ్యర్థి తప్పని సరిగా 10 వ తరగతి అంగన్వాడి ఆయా అభ్యర్ధి తప్పని సరిగా 7 వ తరగతి పాసై ఉండాలన్నారు.

అలాగె తేది01.07.2019 (నియామక సంవత్సరం) నాటికీ 21 సంవత్సరములు నిండి 35 సంవత్సరములు లోపువయస్సు కలిగి ఉండాలని వివరించారు . రోస్టర్ విధానంలో అభ్యర్థుల ఎంపిక వుంటుదన్నారు .

మరిన్ని వివరాలకు సంబదిత శిశు అభివృద్ధి పధకపు అధికారిణి, ఐ.సి.డి.యస్.ప్రాజెక్టు,విశాఖ అర్బన్ -1, డోర్. నెం 38-23-10, ఆర్ .అండ్.బి కూడలి , యఫ్ .సి.ఐ నగర్ , మర్రిపాలెం కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు .

# విజయభాను సంపాదకీయం

## బొలీవియాలో అనిశ్చితి

లాటిన్ అమెరికాలో సామాజిక-ఆర్థికాభివృద్ధికి నమూనాగా మారిన బొలీవియాలో సైనిక తిరుగుబాటు చోటుచేసుకొని దేశాధ్యక్షుడు ఎవో మొరేల్స్ మెక్సికోలో తలదాచుకోవలసి రావడం విషాదకర పరిణామం. మొరేల్స్ వైదొలిగినట్టు ప్రకటించగానే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హర్షం వ్యక్తం చేస్తూ ఇక వెనిజులా, నికారుగువా నాయకులకు కూడా ఇదేగతి పట్టాలనే రీతిలో శాపనార్థాలు పెట్టారంటే, బడుగు దేశాల ప్రజలు బతికి బట్టకట్టకుండా బడాదేశాల పాలకులు ఎంత కరుకుగా వ్యవహరిస్తారో తెలుస్తున్నది. మొరేల్స్ లాటిన్ అమెరికా దేశాలలోనే మొదటి భూమిపుత్ర నాయకుడు. స్థానిక తెగల సామాజిక-ఆర్థికాభివృద్ధికి పాటుపడిన నాయకుడు. దాదాపు దశాబ్దన్నరగా బొలీవియాను పాలిస్తున్న మొరేల్స్ గత అక్టోబర్‌లో 4వ సారి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అధ్యక్ష ఎన్నికల్లో అక్రమాలు జరిగాయంటూ ఉన్నతవర్గాలకు చెందిన ప్రతిపక్షం గగ్గోలు పెట్టింది. అంతర్జాతీయ బృందాలు దీనికి వంతపాడాయి. మళ్లా ఎన్నికలకు కూడా మొరేల్స్ సిద్ధమని ప్రకటించా రు. కానీ ఆయన అసలు పోటీనే చేయవద్దనే షరతును అంగీకరించలేదు. మొదట పోలీసులు, ఆ తర్వాత సైన్యం తిరుగుబాటు చేయడంతో మొరేల్స్ అధ్యక్ష పదవికి రాజీనామా సమర్పించి మెక్సికోలో ఆశ్రయం పొందారు. మొరేల్స్ స్థానంలో తానే తాత్కాలిక అధ్యక్షురాలినని చట్టసభ సభ్యురాలు జీనైన్ అనీజ్ ప్రకటించుకున్నారు. కానీ మొరేల్స్ రాజీనామాతో బొలీవియాలో రాజకీయ శూన్యం ఏర్పడ్డది. ఆయన మద్దతుదారులు ఆందోళన చేపట్టడంతో దేశంలో సంక్షోభం నెలకొన్నది. సుస్థిరంగా పాలన సాగుతున్న దేశం కల్లోలభరితమైపోయింది. ఈ ఘటన ఒక్క బొలీవియాకు సంబంధించినదే కాదు, మొత్తం లాటిన్ అమెరికాలో రాజకీయాలను శాసించడం కోసం, వనరులను చేజిక్కించుకోవడం కోసం సాగుతున్న కుట్ర అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 1980,90 దశకాల్లో ఆర్థిక సరళీకరణ విధానాల మూలంగా ప్రజల బతుకులు దుర్భరం కావడంతో లాటిన్ అమెరికా దేశాల్లో వామపక్ష ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. ఇవి కమ్యూనిస్టు ప్రభుత్వాలు కావు కానీ, వనరులపై ప్రజలకే హక్కు ఉంటుందని, అభివృద్ధి ఫలాలను ప్రజల సంక్షేమానికి మళ్లించాలనే విధానాలను అవలంబించాయి. ప్రపంచవ్యాప్త పోకడ మూలంగా, కార్పొరేట్‌శక్తులు తమ పాలనను అస్థిరత్వం పాలుచేస్తాయనే భయంతో విదేశీ పెట్టుబడులను కూడా అనుమతించాయి. ఈ పరిణామాన్ని యురోపియన్ దేశాల్లో అవలంబించిన ప్రజాస్వా మ్య సోషలిస్టు విధానాలతో కొందరు పోల్చారు. ఈ నాయకుల పాలన మూలంగా లాటిన్ అమెరికాలో పేదరికం తగ్గిపోయి మధ్యతరగతి వర్గం పెరిగిపోయింది. 2002-12 మధ్యకాలంలో లాటిన్ అమెరికా దేశాల్లో ఏటా కోటి మంది లెక్కన మధ్యతరగతి విస్తరించింది. 2000-14 మధ్యకాలంలో పేదరికం 45 నుంచి 25 శాతానికి తగ్గిపోయింది. బొలీవియాలో మొరేల్స్‌తోపాటు వెనిజులాలో చావెజ్, ఈక్వెడార్‌లో రఫేల్ కొరియా వంటివారు గనులను ఇతర వనరులను ప్రభుత్వ రంగంలో పెట్టి సామ్రాజ్యవాద విధానాలను వ్యతిరేకించారు. బొలీవియాలో స్థానిక జాతులన్నీ ఏకమై రాజకీయ ఆధిపత్యం కోసం ఉద్యమిస్తున్న తరుణంలో మొరేల్స్ వారికి నాయకత్వం వహించారు. మొదటిసారిగా భూమిపుత్రుడే దేశాధ్యక్షుడు కావడంతో సామాజికాభివృద్ధి కార్యక్రమాలు సమర్థవంతంగా అమలుచేశాడు. గ్రామీణ పేదలు, భూమి పుత్రులు మొరేల్స్ విధానాలకు మద్దతు ఇస్తున్నారు. కానీ సంపద కేంద్రీకరణను కోరుకునే నగర ప్రాంత ఉన్నతవర్గం, శ్వేతజాతీయులు మాత్రం మొరేల్స్‌ను గద్దె దింపడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ రెండువర్గాల వైరుధ్యమే బొలీవియా సంక్షోభానికి కారణమైంది. బొలీవియాలో ఆందోళనలను సృష్టించి సైన్యం మద్దతుతో మొరేల్స్ ప్రభుత్వాన్ని కూలదోయడం వెనుక దేశంలోని ఉన్నతవర్గాలతో పాటు విదేశీ కార్పొరేట్‌సంస్థల కుట్ర ఉన్నదనే ఆరోపణలున్నా యి. లాటిన్ అమెరికా దేశాలలో వనరులపై కన్నేసిన అమెరికా-యురోపియన్ కంపెనీలే అక్కడ సంక్షోభాలు సృష్టిస్తుంటాయనేది తెలిసిందే. భవిష్యత్తులో శిలాజ ఇంధనాల స్థానంలో విద్యుత్ ఉపయోగం పెరిగిపోయే అవకాశాలున్నాయి. ఈ విద్యుత్ బ్యాటరీలకు లిథియం అవసరం. భూగోళంపై లిథియం నిలువల్లో యాభై నుంచి 70 శాతం బొలీవియాలో ఉన్నాయని అంచనా. ఇప్పటికే పొరుగున ఉన్న అర్జెంటీనా, చిలీ దేశాల్లో లిథియం తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. బొలీవియాలో మాత్రం ప్రభుత్వరంగ సంస్థతో పొత్తు పెట్టుకోవడం ద్వారా తవ్వకాలు సాగించాలని మొరై ల్స్ పట్టుబడుతున్నారు. ఇప్పటికే పలు కార్పొరేట్ కంపెనీలను పంపించివేయడం వల్ల అవి పరిహా రం కోసం అంతర్జాతీయ వేదికలపై న్యాయపోరాటం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో పశ్చిమాసియా మాదిరిగా ఈ ప్రాంతాన్ని గుప్పిట పెట్టుకోవడం కోసమే బొలీవియాలో అనిశ్చితిని సృష్టించాయనే అభిప్రాయమున్నది. బొలీవియా అమెరికా చేతిలో మరో సౌదీ అరేబియాగా మారిపోతుందంటున్నారు.

## భక్తులకు తులసి మొక్కలు పంపిణీ



సింథియా/ములగాడ: మల్కాపురం ఐఓసి వద్దనున్న దుర్గా చింతామని ఆలయం వద్ద కార్తీకసోమవారం పురష్కరించుకొని ప్రముఖ సంఘసేవకులు పెదరెడ్ల నానాజీ ఆధ్వర్యంలో భక్తులకు తులసి మొక్కలను పంపిణీ చేసారు. సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైకాపా రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి ఉద్దా భాస్కరరావు పాల్గొని ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సంధర్బంగా ఉద్దా భాస్కరరావు మాట్లాడుతూ తులసిని పూజిస్తే సకల సౌకర్యాలు, అష్టఐశ్వర్యాలు కల్గుతాయని అన్నారు. ప్రతీ ఒక్కరూ అధ్యాత్మిక చింతన కల్గి వుండాలని, తద్వారా మనశ్శాంతితోపాటు సంఘం మంచి గుర్తింపు వుంటుందని అన్నారు. సంఘసేవకులు పెదరెడ్ల నానాజీ మాట్లాడుతూ సేవా కార్యక్రమంలో భాగంగా ప్రతీ ఏడాది ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సుమారు 300మంది భక్తులకు ఈ మొక్కలను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఉమాశంకర్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## అయిదవ వార్డు లో నూతన ఆటో స్టాండ్ ప్రారంభం



మధురవాడ : మహా విశాఖ అయిదవ వార్డు జాతీయ రహదారి నుండి వైఎస్ఆర్ నగర్ వెళ్లే కూడలి వద్ద శ్రీ విఘ్నేశ్వర సాయి దర్గాలమ్మ పేరుతో నూతనంగా ఆటో స్టాండ్ ను పిఎంపాలెం స్టేషన్ సిఐ రవికుమార్ ప్రారంభించారు, ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ ప్రతి ఆటో కార్మికుడు యూని పాం, లైసెన్స్, రహదారి టాక్స్, ఇన్సూరెన్స్, కాలుష్యరహిత దృవీకరణ పత్రం, తప్పక కలిగి ఉండాలన్నారు వీటితో పాటు ముఖ్యంగా ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ఎంతో అవసరం అని హితవు పలికారు, పోతిన నానాజీ మాట్లాడుతూ వినియోదారులతో మర్యాదగా మెలిగి వారి మన్ననలు పొందాలన్నారు, సిఐ టి యు జోన్ అధ్యక్షుడు రాజ్ కుమార్ మాట్లాడుతూ మారుతూ వస్తున్న ఈ పోటీ ప్రపంచంలో కార్మికులు వ్యవహార శైలి మారకూడదని, నిబంధనలకు అనుగు ణంగా, ప్రజలతో మర్యాదగా నడుచు కుంటూ ఆటో కార్మిక వర్గానికి మంచి పేరు తేవాలని అన్నారు, కోలనీ అధ్యక్షుడు ఓలేటి శ్రావణ్ కుమార్ అధ్యక్ష తన జరిగి ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం లో ఎస్ ఐ శ్రీనివాస్, భవానీ, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## సింహాద్రినాధునికి అన్న ప్రసాదానికి 1 లక్ష విరాళం



సింహాచలం: సింహగిరికొండపై వేంచేసి యున్న సింహగిర వాసునికి విశాఖ మధుర వాడ ప్రాంతానికి చెందిన వేమన రామారావు అనే స్వామి భక్తుడు 1లక్ష 116 రూపాయలు విరాళం ను స్వామి అన్నప్రసాధం గాను సమర్పించారు ఈ చెక్ ను సోమవారంనాడు ఆయన కుటుంబ సభ్యులు సమేతంగా ఆలయ అధికారి దాసరి బంగారు నాయుడుకుఅందజేశారు . అనంతరం ఆలయ అధికారులు వారికి స్వామి వారి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## అమ్మ ఒడి కార్యక్రమం పై ప్రధానోపాధ్యాయులకు అవగాహన సదస్సు

దేవరాపల్లి : మన ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థిని విద్యార్థుల ప్రతి తల్లికి అమ్మ ఒడి పథకం వర్తింపు చేయాలని మండల విద్యాశాఖ అధికారి సిహెచ్ రవీంద్ర బాబు అన్నారు. ఈ విషయమై సోమవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో అమ్మ ఒడి పథకం పై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థిని విద్యార్థి యొక్క ఆధార్ కార్డు, రేషన్ కార్డ్ లో విద్యార్థి అలాగే తల్లి పేర్లు ఒకే విధంగా నమోదు కలిగి ఉండాలని తెలిపారు. ఈ విద్యార్థిని విద్యార్థులు వివరాలు ఆన్లైన్లో నమోదు చేయాలని తెలిపారు. ఎక్కడ ఎటువంటి అభ్యంతరాలు ఉన్న వెంటనే మండల విద్యాశాఖ అధికారి కార్యాలయానికి ఫోన్ చేసి సమస్యలు తెలిపి వాటి పరిష్కరించుకోవాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయుని అని అన్నారు.

ఈ కార్యక్రమంలో వేచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈర్లె గోవిందరావు, కాశీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆదిరెడ్డి సంహచలం నాయుడు, తదితర ప్రధానోపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పట్టాలు పంపిణి చేసిన ఎమ్మేల్యే యు వి రమణమూర్తి రాజు



అచ్యుతాపురం : మండలంలో వెదురువాడ గ్రామంలో సోమవారం యలమంచిలి ఎమ్మేల్యే యు వి రమణమూర్తి రాజు చిప్పాడ పంచాయితీకి చెందిన వారికి ఆర్ ఆర్ పట్టాలు పంపిణి చేశారు . ఈ కార్యక్రమంలో ఆర్ డి ఓ సీతారామారావు, తహశీల్దార్ నారాయణరావు వైసిపి నాయకులు మాజీ ఎంపీపీ చేకూరి శ్రీనివాసరాజు , రెడ్డి శ్రీను, దేశంశెట్టి శంకరరావు , పిన్నంరాజు వాసు , వడిశల శ్రీనివాసరావు , డి ఎస్ ఎన్ రాజు , చేపల వెంకటరమణ , పోలవరపు పారునాయుడు,బలిరెడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు .

## అయ్యప్ప స్వామి విగ్రహ ఆవిష్కరణ



మధురవాడ : మహా విశాఖ 4వ వార్డు పరిధి లక్ష్మీ వాని పాలెం గ్రామంలో పోతిన పరశురామ్ స్వామి గురు పీఠం లో సోమవారం అయ్యప్ప స్వామి విగ్రహ విష్కరణ ఘనంగా నిర్వహించారు. గురు స్వామి పరశురామ స్వామి మాట్లాడుతూ కేరళలోని మండల పూజ ప్రారంభం సందర్భంగా పీఠంలో నాలుగడుగుల అయ్యప్ప స్వామి మైనం విగ్రహాన్ని ఆవిష్కరించి పూజలు నిర్వహించామని అనంతరం స్వామికి ఎంతో ప్రీతికరమైన కర్పూర హారతిని వెలిగించి నైవేద్యం సమర్పించామన్నారు. అనంతరం స్వాములకు అన్నసమారాధన బిక్ష ఏర్పాటు చేశారు, కార్యక్రమంలో వైకాపా నాయకుడు పోతిన ఎల్లాజీ స్వామి, ఎస్. రమణ స్వామి, గరే రాము స్వామి, ఇతర పీఠాల గురు స్వాములు, తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జాతీయ ఫెలోషిప్-2019 అవార్డుకు యువిరావ్ ఎంపిక



సింథియా/ములగాడ: పారిశ్రామికప్రాంతం జీవీయంసీ 45వ వార్డులో నివాసం ఉంటున్న ప్రముఖ సంఘసేవకుడు యు.వి.రావ్ డాక్టర్. బి.ఆర్.అంబేద్కర్ జాతీయ ఫెలోషిఫ్-2019 అవార్డుకు ఎంపికైయ్యాడు. ఈ మేరకు భారతీయ దళిత సాహిత్య అకాడమీ (ఢీల్లీ) జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఎస్.పి.సుమనాక్షర్ ఉత్తర్వులు జారీచేసినట్లు బి.డి.యస్.ఏ సౌత్ ఇండియా ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్.జితేందర్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. విద్యార్థి దశనుంచే స్కౌట్, ఎన్‌సిసిలలో పాల్గొంటూ, దేశభక్తి, సేవాతత్పరత అలవర్చుకుని ఎన్.ఎస్.ఎఫ్.జె.భీమ్ సేన సంఘాలలో చురుకైన పాత్ర పోషిస్తున్న యు.వి.రావ్‌కు డా.బి.ఆర్.అంబేద్కర్ జాతీయ ఫెలోషిప్-2019 అవార్డుకు ఎంపిక చేయడం పట్ల స్థానికులు, స్నేహితులు, తల్లిదండ్రులు, కుటుంసభ్యులు, మేధావులు, ప్రజాసంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సంధర్బంగా యు.వి.రావ్ మాట్లాడుతూ ప్రతీ ఏడాది దేశవ్యాప్తంగా పలుఅంశాలపై ప్రతిభావంతులను ఎంపిక చేసి పురష్కారాలను అందజేయడం జరుగుతుందని, ఈ ఏడాది తనను ఈ అవార్డుకు ఎంపిక చేయడం ఆనందంగా ఉందని అన్నారు.

ఈ ఏడాది డిసెంబర్ 8,9 తేదీలలో న్యూఢీల్లీలో జరిగే కార్యక్రమంలో ప్రముఖుల చేతులమీదుగా ఈ అవార్డును అందుకోబోతున్నానని తెలిపారు.

అవార్డుతో తనకు మరింత సామాజిక భాద్యత పెరిగిందని తెలిపారు. ఈ అవార్డుకు ఎంపిక చేసిన డాక్టర్ జితేందర్‌కు, తనను ప్రోత్సహించిన ఎన్.ఎస్.ఎఫ్.జాతీయ అధ్యక్షులు నెల్లి గురుదేవ్‌కు యు.వి.రావ్ కృతజ్ఞతలను తెలిపారు. జైభీమ్ సేన్ యోధులు రవి సిద్దార్థ, ఓంకార్,రిటైర్డు అధికారి ప్రసాద్, సైంటిస్టు వేమన, జైభీం బాక్సింగ్ క్లబ్ బాక్సర్‌లు యు.వి. రావ్‌కు అభినందనలను తెలిపారు.

## శివాలయాలకు పోటెత్తిన భక్తులు



గాజువాక : కార్తీకమాసం మూడవ సోమవారం పురష్కరించుకొని శివాలయాలలో శివునికి ప్రత్యేకపూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. పారిశ్రామిక ప్రాంతంలోని సింథియా, మల్కాపురం, గాజువాక, అక్కిరెడ్డిపాలెం, పెదగంట్యాడ, స్టీల్‌ప్లాంట్, కూర్మన్నపాలెం, అప్పికొండ తదితర ప్రాంతాలలోని శివాలయా లలోతెల్లవారు జామునుంచే భక్తులు శివాలయాలకు చేరుకొని శివనామస్మరణతో ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శివునికి అత్యంత ప్రీతిపాత్రమైన కార్తీక మాసంలో శివుని ధ్యానించి, ప్రత్యేక పూజలు చేసినవారికి పుణ్యఫలం వస్తుందని, కోరిన కోర్కెలు తీరుతాయని ఇది భక్తుల విశ్వాసమని ఆలయ పూజారులు తెలిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలను కల్పించారు.

***సనత్‌నగర్‌లో***..........గాజువాక సనత్‌నగర్ ఉడా కాలనీ డబల్ రోడ్డు సమీపంలో వేంచేసిన శ్రీశ్రీశ్రీ ఉమారామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో కార్తీక మాసం మూడవ సోమవారం పురష్కరించుకొని శివునికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలను ఆలయ అర్చకులు పూజ్యం బంగారుశర్మ, పూజ్యం విష్ణుశర్మ, పూజ్యం అయ్యప్పశర్మ సమక్షంలో వైభవంగా నిర్వహించారు. ఈ పూజాకార్యక్రమానికి పరిసరప్రాంత భక్తులు, అయ్యప్పస్వామి భక్తులు పాల్గొని స్వామివారి ని దర్శించుకున్నారు. ఈ సందర్బంగా అర్చకులు మాట్లాడుతూ ఈ నెల 23వ తేదీన స్థిరవారం లక్షబిల్వార్చన, కళ్యాణమహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించడం జరుగుతుందని, కావున భక్తులు పాల్గొని జయప్రదం చేసి గోత్రనామములను నమోదు చేయించుకొని, తీర్థ ప్రసాదాలను స్వీకరించి స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

## ఎపిబిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకర్రావుకు ఘన సత్కారం



గాజువాక: ఎపిబిసి సంక్షేమ సంఘం రాష్ట్రఅధ్యక్షులు కేశన శంకర్రావును గాజువాక బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు జాగారపు శ్రీను ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఉత్తరాంధ్ర పర్యటనకు విచ్చేసిన ఎపిబిసి సంక్షేమ సంఘం రాష్ట్రఅధ్యక్షులు కేశన శంకర్రావును నగరంలోని సీతమ్మధార కార్యాలయంలో సోమవారం గాజువాక బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు జాగారపు శ్రీను శాలువ కప్పి పుష్పగుచ్ఛాన్నిచ్చి, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. ఈ సంధర్బంగా కేవన శంకర్రావు మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో ప్రభుత్వరంగాలను ప్రైవేటుపరం చేయడంలో వేగంగా సమీకరణాలను చేపడుతున్న నేపధ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలకు ప్రైవేటు రంగాలలలో రిజర్వేషన్ కల్పించేలా చట్టాలు చేయాలని, జనాభాలో 60శాతం ఉన్న బిసీలకు రిజర్వేషన్ కల్పించాలని ప్రభుత్వాలను డిమాండ్ చేసారు. అదేవిధంగా రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 34శాతం అమలు చేస్తున్న రిజర్వేషన్ యధావిధిగా కొనసాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా బిసి సంఘం అధ్యక్షులు బి.నాగేశ్వరావు, బిసి నాయకులు కామినేని సుబ్బారావు, ముమ్మనమురళి, అధిక సంఖ్యలో బిసీలు హాజరైయ్యారు.

## “సృజనాత్మక శక్తి ” అంశంపై వ్యాచరనపోటీలు



సింథియా/ములగాడ: వ్యక్తులలోని సృజనాత్మక శక్తిని వెలికి తీసి, వారిని మేదావులుగా తీర్చిదిద్దడానికి వ్యాసరచన పోటీలు ఎంతగానో దోహదపడతాయని పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు టి.శ్రీరామమూర్తి పేర్కొన్నారు. సోమవారం మల్కాపురం ప్రకాష్‌నగర్ శాఖాగ్రంథాలయంలో గ్రంథాలయవారోత్సవాల్లో భాగంగా స్థానిక యువతకు, విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని పోటీలను ప్రారంభించారు. ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతూ భాషా నైపుణ్యం, సమాచార స్పష్టత, వ్యాకరణంపై పట్టు వ్యాసరచనకు ఎంతో అవసరమన్నారు. అనంతరం నవభారత నిర్మాణం, అవినీతి నిర్మూలన, సామాజిక అభివృద్ధిలో యువత పాత్ర అనే అంశాలపై మూడు కేటగిరిలో వ్యాసరచన పోటీలను నిర్వహించారు. న్యాయనిర్ణేతులుగా ప్రముఖన్యాయవాది జి.కాశీవిశ్వనాధరాజు, జాతీయ సేవపథకం అధికారి వై.అనసూయదేవి, జి.శిరీషలు వ్యవహరించారు. వారోత్సవాల ముగింపురోజున గెలుపొందిన వారికి బహుమతులను అందజేయడం జరుగుతుందని నిర్వాహాకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.యస్. భాగ్యలక్ష్మి, స్థానిక నాయకులు డి.అప్పలనాయుడు, గ్రంథాలయాధికారి మొహన్‌రావు, జాతీయ సేవా పథక కార్యకర్తలు, స్థానిక యువనాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగ రైతుకు వీల్ చైర్ పంపిణీ

అనంతగిరి,: అరకు లోయ నియోజకవర్గం, డుంబ్రిగుడా గిరిజన సంఘం మండలకమిటి ఆధ్వర్యంలో లైగండ పంచాయితీ పనసపుట్టు గ్రామానికి చెందిన జి.చందుబాబును వీల్ చైర్ ను సిపిఎం రాష్ట్రాకమిటి సభ్యుడు కీల్లోసురేంద్ర ఆధ్వర్యంలో పంపిణీ చెయ్యడమైనది.గత రెండేళ్ల క్రితం దుక్కి దున్ని కొనేటిల్లర్ ప్రమాదంలో రెండు కాళ్ళు పూర్తిగా విరిగి కాళ్ళు పనిచేయకుండా పోయింది.విశాఖలోని కోరమండల్ ఫెర్టిలైసెర్ సంస్థ ఆర్థిక సహకారంతో సుమారు 6 వేల ఖరీదైన వీల్ చైర్ ను పంపిణీ చెయ్యడమైనది.

# స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్



విశాఖపట్నం : విశాఖపట్నం విఐపి రోడ్ మరియు గాజువాకలో గల స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ విద్యార్థులు బాలల దినోత్సవం సందర్భంగా న్యూఢిల్లీ రాష్ట్రపతి భవన్‌లో మన ప్రియతమ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవిందను కలిసే అవకాశం వచ్చినందుకు సంతోషిస్తున్నా మనిస్కూల్ డైరెక్టర్ మళ్ల రామునాయుడు తెలిపారు. ఎడ్యు ఈజీ అను విద్యావిధానం అనుసరిస్తున్న స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ నర్సరీ నుండి 6వ తరగతి వరకు ఉన్న విద్యార్థులు వివిధ రంగాలలో ప్రతిభను ప్రదర్శించి 128 బుక్స్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నారు. 16 అంశాలలో ఒకే రోజున రికార్డు బ్రేకింగ్ ఈవెంట్స్ చేసి 128 రికార్డులు కైవశం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆరుగురు పిల్లలకు, ఇద్దరు ఉపాధ్యాయులకు రాష్ట్రపతిని కలిసే అవకాశం లభించిందని ప్రిన్సిపాల్ ఎం. వాణిశ్రీ, ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

వైష్ణవి, ఎస్.కె. షరీన్, భవ్యశ్రీ, జ్యోతిస్వరూప్, హర్షిత్, వరప్రసాద్ మరియు స్కూల్ డైరెక్టర్ మళ్ల రామునాయుడు, స్కూల్ కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## సత్యదేవుడ్ని దర్శించిన శంకర్రావు



అన్నవరం..... తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివార్ని ఆంధ్రప్రదేశ్ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేశన.శంకర్రావు శ్రీ స్వామివార్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆయనకు ఆలయ మర్యాదలతో ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు.దర్శనం అనంతరం వేద పండితులు వేద ఆశీర్వాదములు అందజేసి శ్రీ స్వామివారి ప్రసాదమును అందజేశారు.

## బ్రహ్మ కమలం పుష్పం



భీమునిపట్నం: భీమిలి స్మిత్ వీధి లో ఉన్న కాశీ విశ్వనాథ్ ఇంట్లో బ్రహ్మ కమలం పుష్పం వికసించింది. కేరళా నుంచి బ్రహ్మ కమలం మొక్కలను శుక్రవారం తన గృహానికి తీసుకొని వచ్చి పూజలు మొదలు పెట్టారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి ఈ పుష్పం వికసించింది. కార్తీక సోమవారం కావడంతో వారి ఇంటికి భక్తుల తాకిడి పెరిగింది. సువాసనలు వెద జల్లే ఈ పుష్పం ఆకుల చివరన వికసించడం దీని ప్రత్యకత.

## పూడిమడకలో నాగూరమ్మ , బాపనమ్మ అమ్మవార్ల పండుగ మహోత్సవాలు

అచ్యుతాపురం : మత్స్యకార గ్రామమైన పూడిమడకలో నాగూరమ్మ, బాపనమ్మ అమ్మవార్ల పండుగలు ఘనంగా నిర్వహించుటకు గ్రామపెద్దలు ఏర్పాట్లు చేశారు . నేడు (మంగళవారం) నాగూరమ్మ అమ్మవారు పండుగ ,వచ్చే మంగళవారం బాపనమ్మ అమ్మవారు పండుగ చేయుటకు గ్రామపెద్దలు ఏర్పాట్లు చేశారు. గతంలో ఈ అమ్మవార్ల పండుగలలో యువకులు వేపాకును సేకరించి అమ్మవార్లపై చల్లేవారు .అమ్మవారు వెళ్లే మార్గం వేపాకుతో నిండి ఉండేది . నాగూరమ్మ అమ్మవారు పండుగకు విగ్రహాలను పల్లకిపై ఊరేగించి మొక్కు తీర్చుకుంటారు .

## అన్ని పంచాయతీలలో బ్రాడ్ బ్యాండ్ సేవలు

### బిబియన్ జనరల్ మేనేజర్,పి, రాజు



అనంతగిరి,మండలంలో అన్ని పంచాయతీలలో బ్రాడ్ బ్యాండ్ సేవలు కామన్ సర్వేసు సెంటర్, బిబి ఎన్ ఎల్ సంయుక్తంగా జిల్లాలోని 21 బ్లాకులలో 431 పంచాయతీలకు ఈ బిబిఎన్ ఎల్ సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ,విశాఖపట్నం బిబిఎన్ఎల్ జనరల్ మేనేజర్ పి రాజు అన్నారు.సోమవారం జిల్లా కేంద్రం లోగల సీతమ్మధారలో గల బిఎస్ ఎన్ ఎల్ కార్యాలయంలో సియస్ సి,బిబి ఎన్ ఎల్ ఫీల్డ్ టెక్నీషియన్స్‌తో సమావేశమయ్యారు. నెట్ సేవలతో పాటు ల్యాండ్ ఫోన్ సౌకర్యం కూడా వివిధ ప్లాన్స్ ద్వారా అందించనున్నామని ఆయన తెలిపారు.డిసెంబర్ నెల ఆఖరికి పూర్తి స్థాయిలో 431 పంచాయతీ కేంద్రాలకు సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలియజేసారు.ఈ కార్యక్రమంలో టెక్నికల్ క్యాన్సల్టెంట్ బిఎస్ ఎన్ ఎల్ ఆర్ వి ఎస్ ఎన్ రామారావు, సీఎస్ సి జిల్లా మేనేజర్లు చంద్రశేఖర్,సంతోష్,నెట్ వర్కు ఇంజనీర్ బాలశంకర్ తదితరులు పాల్గొన్నారు.




విశాఖపట్నం జిల్లా కోర్ట్ లో నాయవాదులు ఆంధ్ర ప్రదేశ్ హై కోర్ట్ విశాఖపట్నం లోనే పెట్టి, తీరాలని రిలే దీక్ష చేసినారు ఈ సందర్భం గా విశాఖపట్నం బార్ అసోసియేసన్ ప్రదాన కారయదర్శి అక్కరమాన కొండబాబు మరియు సీనియర్ నాయవాది పి. కోటేశ్వరరావు, బైపా అరుణ్‌కుమార్, పలకా శ్రీరామమూర్తి, జి. శ్రీనివాస్ నాయవాదులు పాల్గొనీ ఈ పోరాటం ఆగదని హైకోర్ట్ సాదించేవరకు కొనసాగుతుందని వివరించారు.

## జోన్-4 స్పందనకు 12 వినతులు



విశాఖపట్నం : జోన్-4 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి అర్జీదారులు వినతి పత్రాలు సమర్పించారు. ఉన్న వార్డులలో పలు సమస్యలపై జోనల్ కమిషనర్ పి.సింహా చలంనకు వినతిపత్రం అందించారు. వార్డుల్లో పలు సమస్యలపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## మంత్రి మల్లాడిని పరామర్శించిన తోట, జి యన్ నాయుడు, పలువురు ప్రముఖులు



యానాం : పితృ వియోగం తో బాధపడుతున్న పుదుచ్చేరి ఆరోగ్య శాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు ను రామచంద్రపురం మాజీ ఎమ్మెల్యే తోట త్రిమూర్తులు అదేవిధంగా యానాం రీజన్సీ పరిశ్రమల అది నేత జి యన్ నాయుడు పలువురు ప్రముఖులు సోమవారం ఉదయం పరామర్శించారు స్థానిక ఎర్ర గార్డెన్స్ లోని మంత్రి మల్లాడి నివాసంలో మంత్రిని కలుసుకొని పరామర్శించి వారి వారి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు .అనంతరం మంత్రి తండ్రి స్వర్గీయ సూర్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

అదేవిధంగా పలువురు రాజకీయ ,వ్యాపార తదితర రంగాల ప్రముఖులు ఆయా ప్రాంతాల ప్రజలు మంత్రిని కలుసుకొని వారి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు .ఈ కార్యక్రమంలో మంత్రి మల్లాడి కుటుంబ సభ్యులు , తదితరులు పాల్గొన్నారు .

## ఈనెల 21న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి యానం రాక

యానాం : ఈనెల 21న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి యానం రాక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఈనెల 21న యానం రానున్నారు కేంద్రపాలిత ప్రాంతమైన యానం ప్రజా ప్రతినిధి పుదుచ్చేరి ఆరోగ్య శాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు తండ్రి స్వర్గీయ సూర్యనారాయణ మృతి చెందడంతో మంత్రి మల్లాడి ని పరామర్శించేందుకు ఆయన రాన్నారు దివంగత ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి తో మంత్రి మల్లాడికి ఉన్నటువంటి స్నేహ భావం కారణంగా ఆయన కుమారుడు జగన్ మోహన్ రెడ్డి మంత్రి మల్లాడి తో ఎంతో సన్నిహితంగా ఉంటున్న విషయం విదితమే అయితే ఇటీవల మంత్రి మల్లాడి తండ్రి స్వర్గీయ సూర్య మృతిచెందడంతో ఈ నెల 21న ఆయన ముమ్మిడివరం నియోజకవర్గంలోని వారధి ప్రారంభం మత్స్యకారులకు పరిహారం పంపిణీ తదితర కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి తూర్పు గోదావరి జిల్లాలో పర్యటించనున్నారు ఈ మేరకు అమలాపురం డి పి ఎన్ ఆర్ ఓ డి.ఎస్.పి తదితర అధికార బృందం యానం పెర్రి రోడ్ లో గల ఎలేప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు అనంతరం మంత్రి మల్లాడి ని కలిసి తమ ప్రగాఢ సంతాపం తెలియజేశారు

## వైఎస్ఆర్ నవశకంపేరిట ప్రత్యేక కార్యక్రమం

అనంతగిరిః రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి నవరత్నాలు లో భాగంగా ప్రవేశపెట్టిన ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు సాచ్యురేషన్ విధానంలో అర్హులైన ప్రతి లబ్ధిదారునికి అందేలా ఆయా పథకాలకు లబ్ధిదారుల గుర్తింపునకు వైయస్సార్ నవశకం పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు అనంతగిరి మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఏవి కుమార్ పత్రికలకు వెల్లడించారు

ఈ మేరకు 18, 19, తారీకు లలో అనంతగిరి వెలుగు కార్యాలయంలో మండలంలో గల గ్రామ వాలంటీర్లకు శిక్షణ తరగతులు ఇస్తున్నామని ప్రతివారు నవంబర్20 తారీకు నుంచి 30వ తేదీ వరకు గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి వారివారి క్లష్టర్లలో సర్వే నిర్వహించి లబ్ధిదారులను గుర్తించాలని స్పష్టం చేశారు

## ఆదిరెడ్డిపాలెంలో ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన




సబ్బవరం ... మండలం లోని ఆదిరెడ్డిపాలెం గ్రామం లోని కార్తీక మూడవ సోమవారం రాఘవేంద్ర కంటి ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి విశేష స్పందన లభించిందని అన్నారు. ఈ కంటి వైద్య శిబిరాన్ని విశాఖపట్నం జిల్లా బిసి సెల్ అధ్యక్షులు కొటాన రాము ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్ఞానేంద్రియాలో కంటి భాగం చాలా ప్రధానమైనది. ఈ కళ్లు మూడు నెలలకొకసారి కంటి వైద్యునితో పరీక్ష చేయించు కోవాలన్నారు.ఈ గ్రామీణ ప్రాంతాల్లో పెట్టిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రజలందరూ సద్వినియోగ పరుచుకోవాలన్నారు. ఈ ఉచిత కంటి వైద్య శిబిరానికి సుమారు 200 మందికి ఆధునిక పరికరంతో పరీక్ష చేసి ఉచితంగా మందులు పంపిణీ చేసారు. అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు ఉచితంగా చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి కొటాన కోటయ్య, కొటాన ఆనంద్, బైలపూడి దేముడుబాబు, డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.


## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు వీడి ఏ విద్యార్థుల ఎంపిక ..




కంచరపాలెం : మర్రిపాలెం 104 కూడలి వద్ద నున్న వైజాగ్ డిఫెన్స్ అకాడమీ లో విద్యను అభ్యసించిన 100 మంది విద్యార్థులు పలు రక్షణ రంగ కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపికయినట్లు వైజాగ్ డిఫెన్స్ అకాడమీ డైరెక్టర్ వాసుపల్లి గణేష్ కుమార్ సోమవారం తెలిపారు .ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మా సంస్థలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే శిక్షణ ఇచ్చి , వారికీ రక్షణ రంగ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు పొందేందుకు మా సంస్థ వారికి తర్ఫీదు ఇచ్చేందుకు ఎప్పుడూ అగ్రగామిగా ఉంటుందన్నారు. అదే విధంగా సీనియర్ సెకండరీ రిక్యూర్మెంట్ లో, కోస్ట్ గార్డ్, నేవీ , ఆర్మీ, విభాగాల్లో మా విద్యార్థులు ఎంపిక కావడం చాలా ఆనందకరమన్నారు. ఎంపికైన అభ్యర్థులు దేశం గర్వించదగ్గేవిధంగా విదులు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులకు మిఠాయిలు పంచి పెట్టారు.

## గౌరీ పరమేశ్వర సహిత ద్వాదశ జ్యోతిర్లింగాల ఆలయంలో ప్రత్యేక పూజలు

### కార్తీక మాస మూడవ సోమవారం పలు శివాలయాల్లో అన్న సమారాధనలు



సబ్బవరం ... కార్తీక మాస మూడవ సోమవారంను పురస్కరించుకుని సబ్బవరం మండలంలోని పలు శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. అలాగే మధ్యాహ్నం భారీ అన్నసమారాధనలు నిర్వహించారు. కార్తీక మాసంలో వచ్చే మూడవ సోమవారం శివునికి అత్యంత ప్రీతికరమైనది కావడంతో స్వామి వారిని పంచామృతాభిషేకాలతో అభిషేకించి, ఫల పుష్పములతో పూజించి దర్శించిన సకల పాపాలు తొలగి పోవడమే కాకుండా భక్తుల కోరిన కోర్కెలు తీర్చుతారని భక్తుల ప్రగాఢ నమ్మకం. ఈ నేపథ్యంలో భక్తులు ఉదయం 5 గంటలకే శివాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.సబ్బవరం ఈశ్వర లింగానికి, గొర్లివానిపాలెం ఉమా మహేశ్వర స్వామి, ఇరువాడ భీమలింగేశ్వర స్వామికి , సబ్బవరం సాయినగర్ శివ పంచాయితీ ఆలయంలో, లింగాల తిరుగుడులో సోమనాథ స్వామికి, దేవీపురం భైరవ లింగేశ్వరస్వామికి తదితర శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెదయాతపాలెంలో ధర్మకోనేరులో కొలువై ఉన్న శ్రీ గౌరీ పరమేశ్వర సహిత ద్వాదశ జ్యోతిర్లింగాలకు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశాఖ డెయిరీ డైరెక్టర్ శరగడం శంకరరావు, మాజీ ఎంపిపి శరగడం అప్పలనాయుడు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద భజన కార్యక్రమం నిర్వహించి మధ్యాహ్నం 12 గంటలకు భారీ అన్న సమారాధన జరిగింది. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## రైతుల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యం

### పెందుర్తి ఎమ్మెల్యే అధీప్‌రాజ్



సబ్బవరం .... రైతుల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అధీప్‌రాజ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం వారోత్సవాలు ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఎమ్మెల్యే అధీప్‌రాజ్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. రైతులు సహకార పథకాలపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. సహకార సిబ్బంది తరచూ రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి సహకార పథకాలపై రైతులకు తెలియజేయాలన్నారు. ప్రస్తుతం ఉన్న పిఏసిఎస్ భవనంపై కళ్యాణ మండపం నిమిత్తం మరో అంతస్థు నిర్మించేందుకు కృషి చేస్తానని అధీప్‌రాజ్ హామీ ఇచ్చారు. పిఏసిఎస్ తాత్కాలిక అధ్యక్షుడు మోపాడ అప్పారావు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో డివిజనల్ కో ఆపరేటివ్ అధికారి బి.దుర్గాప్రసాద్, బిసి సెల్ అధ్యక్షులు కొటాన రాము, తుంపాల అప్పారావు, సబ్బవరపు ముత్యాలనాయుడు, బి.మహలక్ష్మినాయుడు, శరగడం రాము, గవర శ్రీనువాసరావు, మండల సముద్రం, ధనిమిరెడ్డి శ్రీను, కర్రి బాబు తదితరులు పాల్గొన్నారు.

## యానాం రీజెన్సీ పూర్వవైభవం రానుందా?

యానాంః కేంద్రపాలిత ప్రాంతమైన యానం నియోజకవర్గంలోని 2012 సంవత్సరం వరకు కళకళలాడుతున్న రీజెన్సీ పరిశ్రమ విధ్వంసకర సంఘటనలు నేపథ్యంలో యాజమాన్యం లాకౌట్ ప్రకటించిన విషయం విదితమే 8 సంస్సరాలు కార్మికుల సుదీర్ఘ పోరాటం అనంతరం సమస్యలు పరిష్కరించిన యాజమాన్యం ఆదివారం యానాం రాకతో కార్మికులు ఘనస్వాగతం పలికారు అనంతరం ప్రత్యేక వాహనం మై మేల తాలాల నడుమ యానాం పూరవీధులో ర్యాలి నిర్వహించారు నేపథ్యంలో అందరిలో మళ్ళీ యానాం నికి పూర్వవైభవం రానున్నందా? పరిశ్రమ అదినేత జిఎన్ నాయుడు కొన్ని సంవత్సరాల తర్వాత యానం రావటంతో మరల యానం ప్రాంతానికి పూర్వవైభవం తీసుకురానున్నారు అనే ప్రశ్న ఆంధ్రిలో ఉంది నిరుద్యోగ యువతకు ఉపాధిఅవకాశాలు కల్పించేందుకు, కుదేలైన చిరు వ్యాపారులకు ఊరటనిచ్చేందుకు, ఒకప్పుడు వేల మందికి జీతం, జీవితం ఇచ్చిన సంస్థ అయినటువంటి రీజెన్సీ సెరామిక్స్ ఫేక్టరీ ను తిరిగి ప్రారంభించడానికి యానాం వచ్చిన అధినేత . జి.ఎన్. నాయుడు కి యానాం పీపుల్స్ ఫోరం , విజిల్ బ్లోయర్ మరియు యానాం హుమన్స్ ఆర్గనైజేషన్ సంస్థల తరపున అపూర్వక స్వాగతం పలికారు ఈ సందర్భంగా రీజెన్సీ ఫ్యాక్టరీను తెరిపించేందుకు 8 ఏళ్లుగా అవిశ్రాంతంగా పోరాటం చేసిన కార్మికులకు, స్వచ్ఛంద సంస్థలు, పుర ప్రముఖులకు యానాం ప్రజలకు నాయుడు కృతజ్ఞతలుతెలిపారు

# రత్నగిరిపై పోటెత్తిన భక్తసంద్రం

**- కిటకిటలాడిన సత్యదేవుని సన్నిధి.**

**- భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేసిన ఈవో వి.త్రినాధరావు.**



అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో రత్నగిరిపై కార్తీకమాసము మూడవ సోమవారం సందర్భంగా తెల్లవారుజాము నుంచే దేవస్థానం భక్తుల రద్దీతో కిక్కిరిసిపోయింది. కార్తీకమాసము పర్వదినం కావడంతో సత్యదేవుడ్ని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. రత్నగిరికి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణమంతా కిటకిటలాడింది.దేవస్థానం అధికారులు పర్వదినాల్లో ముందుజాగ్రత్త చర్యగా వ్రతాల టిక్కెట్ కౌంటర్లు రాత్రి ఒంటి గంట నుంచే తెరిచే విధంగా చర్యలు తీసుకున్నారు.1గంట నుంచే వ్రతాలు ప్రారంభించారు.2 గంటల నుండే దర్శనాలు ప్రారంభం అయ్యాయి.తెల్లవారుజాము నుండి తూర్పు రాజ గోపురము ఎదురుగా ఉన్న రావి చెట్టు వద్ద భక్తులు దీపములు,వత్తులు వెలిగించి తమ మ్రొక్కులు తీర్చు కున్నారు. వ్రతాల నిర్వహణలోగానీ,దర్శన క్యూలైన్లలోగానీ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసేందుకు ఈవో వి. త్రినాధరావు దేవస్థానానికి సంబంధించిన ఏఈవోలు,పీఏలు, సూపరింటెండెంట్లతోపాటు కింది స్థాయి సిబ్బందికి ప్రత్యేక డ్యూటీలు వేశారు. స్వామివారి ఉచిత దర్శనానికి రెండు గంటలు,శీఘ్ర దర్శనానికి గంట సమయం పట్టింది.రత్నగిరికి వచ్చే భక్తుల కోసం స్వామివారి నిత్యాన్నదాన పథకం ద్వారా భక్తులకు ఉదయం నుంచి సాయంత్రం వరకు పులిహోర,దద్దోజనం పంపిణీ చేశారు.దేవస్థానం ఈవో వి.త్రినాధరావు ఎప్పటికప్పుడు అన్ని విభాగాలను పరిశీలిస్తూ పర్యవేక్షణ చేసి భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగ కుండా తగిన ఏర్పాట్లు చేసారు.

## సత్యదేవుని నిత్య అన్నదాన పథకానికి రూ.1,00,116/- విరాళం



అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి తూ.గో.జిల్లా రాజమహేంద్రవరం కు చెందిన కముజు.వెంకట్రావు ఆదివారం రూ.1,00,116/- విరాళమును అన్నదాన విభాగం సూపరింటెండెంట్ ఉమాపతికి అందజేసి ప్రతీ సంవత్సరం దీనిపై వచ్చు వడ్డీతో కార్తీక బహుళ తదియ రోజున కముజు.విజయలక్ష్మి పేరున అన్నదానం జరిపించ వలసినదిగా కోరారు.ఈ సందర్భంగా దాతలను ఉమాపతి అభినందించారు.

# ప్రేమసమాజంలో ఘనంగా పైలా శివతేజ 26వ జయంతి వేడుకలు

## వృద్ధులకు,చిన్నారులకు అన్నసమారాధన, పండ్లు పంపిణీ



విశాఖపట్నం : ప్రేమసమాజంలో పైలా శివతేజ 26వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. పైలా శివతేజ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పైలా దివాకరరావు ఆధ్వర్యంలో సోమవారం జయంతి వేడుకలు నిర్వహించారు. ముంధుగా కేక్ కటింగ్ చేశారు. అనంతరం ప్రేమసమాజంలో వృద్ధులు, మహిళలకు చిన్నారులకు అన్నసమారాధన నిర్వహించి స్వీట్లు పంపిణీ చేశారు. అక్కడ నుంచి పాపా హోమ్ కు వెళ్లి అక్కడ చిన్నారులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించి చిన్నారుల మధ్య కేక్‌ను కట్ చేసి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు , వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయుకులు పక్కి దివారక్, రవిరెడ్డి, నారానాగేశ్వరావు, కంపా హనోక్ తదితర్లు హజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పైలా శివతేజ పౌండేషన్ సేవలను కొనియాడారు. ప్రతి ఏటా శివతేజ జయంతి, వేడుకలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. అవగహన ద్వారా రోడ్లు ప్రమాదాలను నివారించగలమన్నారు. యువత ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ వేగంగా వెళ్ళకుండా వాహనాలు నడపాలని అప్పుడే తల్లింఢ్రులకు శోకం వుండందన్నారు. కార్యక్రమంలో శివతేజ తల్లిదండ్రులు దివాకర్, రమణి, కుటుంబసభ్యులు జోష్న, శివతేజ మిత్రులు, జర్నలిస్టు మిత్రులు పాల్గోన్నారు.



## స్పందన అర్జీలపై నివేదిక అందించాలి :ఎస్పీ నయీ అస్మీ



కాకినాడ : స్పందన అర్జీలపై ఎప్పటికప్పుడు నివేదిక అందించాలని సంబంధిత అధికారులకు ఎస్పీ నయీం అస్మీ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ, ఓఎస్డీ ఆరీఫ్ హఫీజ్ అర్జీదారుల నుండి విన్నపాలను స్వీకరించారు. అర్జీదారుల సమాస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో పిర్యాదు దారుల సమక్షంలో వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడి వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ స్పందన కార్యక్రమంలో 95 మంది పిర్యాదులు స్వీకరించడం జరిగిందని,వచ్చే సోమవారం యధావిధిగా స్పందన కార్యక్రమం కొనసాగుతుందని ఎస్పీ నయీం అస్మీ తెలిపారు.

## తరగాకు విప్రరత్న అవార్డు



కాకినాడ: రిటైర్డ్ తపాలా ఉద్యోగి తురగా సూర్యారావు కువిప్రరత్న అవార్డు లభించింది.జాతీయ విశిష్ట ప్రతిభ పురస్కారాన్ని నిడదవోలు లోని వేదిక సొసైటీ త్వరగా సూర్యారావుకు అంద చేసింది.

# జగన్మోహన్ రెడ్డి నిర్ణయం హర్షనీయం



భీమునిపట్నం : జగన్మోహన్ రెడ్డి ఇంగ్లీష్ మాధ్యమం లో విద్యార్థులకు ఇంగ్లీష్ ను ప్రవేశపెట్టడం హర్షనీయమని ఉత్తరాంధ్ర దళిత సంఘం నాయకులు భాగం గోపాలరావు తెలిపారు. భీమిలి, 23 వ వార్డు,కృష్ణా కాలనీలో ఉన్న ఎస్.సి హాస్టల్ లో దళిత సంఘాల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి విద్యార్థులకు ఇంగ్లీష్ మాధ్యమం పెట్టడంతో ఆయన చిత్ర పటానికి పూలాభిషేకం చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కలలు కన్న సామాజిక న్యాయం లభించినట్లు తెలిపారు. ఈ విధానం వల్ల ఎస్.సి.ఎస్.టి.బి.సి,మైనారిటీ విద్యార్థులు కార్పొరేట్ కళాశాల విద్యార్థులతో పోటీపడి మంచి పలితాలు సాధించగలరని అన్నారు. ఈ కార్యక్రమంలో జి.వి రమణ , ఉప్పాడ. నాగేశ్వరరావు , నాగార్జున, బి.సి హాస్టల్ వార్డెన్, సన్యాసి తదితరులు పాల్గొన్నారు.

## కాపులుప్పాడ గ్రామంలో ఆక్రమణలు తొలగింపు



భీమునిపట్నం: భీమిలి మండలం కాపులుప్పాడ గ్రామంలో ఆక్రమణ స్థలాలను తొలగించి నట్లు వి.ఆర్.ఓ ఎం. వీర్రాజు తెలిపారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ సర్వేనెంబర్ 1/1 కొండ పోరంబోకు సుమారు అరవై మూడు సెంట్లలో ఉన్న రెండు రేకుల షెడ్డు లను ప్రహరీ గోడ నిర్మాణం, అదేవిధంగా సర్వే నెంబరు 11 లో 10 సెంట్ల భూమిలో ఉన్న షెడ్,ప్రహరీ గోడ,ఈ రెండు ఆక్రమణ స్థలాలను సోమవారం ఎం ఆర్ ఐ సౌజన్య, సర్వేయర్ దుర్గాప్రసాద్, ఎస్ ఐ, పోలీస్ సిబ్బంది , లైన్ మెన్ ఆధ్వర్యంలో తొలగించినట్లు చెప్పారు. అంతేకాకుండా తహసీల్దార్ ఈశ్వర రావు ఆదేశాల మేరకు ఆ స్థలంలో ప్రభుత్వ భూమి బోర్డును పెట్టినట్లు చెప్పారు. ఇక మీదట ఎవరైనా ప్రభుత్వ భూమిని ఆక్ర మిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఈశ్వరరావు హెచ్చరించారని చెప్పారు.

## ఘనంగా వైసిపి నేత జీరు వెంకటరెడ్డి జన్మదిన వేడుకులు



భీమునిపట్నం: భీమిలి వై సి పి పట్టణ ప్రధాన కార్యదర్శి జీరు వెంకటరెడ్డి జన్మదినం సందర్భంగా సోమవారం భీమిలి పట్టణ కమిటి ఆధ్వర్యంలో పుట్టినరోజు వేడుకలు వెంకటరెడ్డి నివాసంలో ఘనంగా జరిగాయి. నాయుకులు,కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి అందరికి పంచి పెట్టారు.ఈ కార్యక్రమం లో వైసిపి నాయుకులు కాకర్లపూడి వరహలరాజు, జగ్గపల్లి.ప్రసాద్,రమణ, సుజాత, ప్రమీల, పిన్నింటి.ఎర్రయ్య రెడ్డి , డింగి హరి కిరణ్ రెడ్డి, రాంభుక్త . ప్రభాకర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ శివరామకృష్ణ దేవాలయంలో అన్న ప్రసాద వితరణ



విశాఖపట్నం: అస్సాం గార్డెన్స్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఎదురుగా గల దేవాదాయ ధర్మాదాయ శాఖ శ్రీ శివరామకృష్ణ దేవాలయంలో ఘనంగా కార్తీకమాస పూజలు నిర్వహించడమైనది. కార్తీకమాసాన్ని పురస్కరించుకొని ఆలయ సన్నిదానం లో అన్నప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమాన్ని చల్మాజి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మట్టపల్లి హనుమంతు రావు మరియు డి.శ్రీనివాసులు ప్రారంభించారు. అనంతరం మట్టపల్లి హనుమంతురావు భక్తులనుద్దేశించి మాట్లాడుతూ అన్నం పరబ్రహ్మ స్వరూపమని తెలిపారు. ప్రతిఒక్కరూ జీవితంలో ఒక్కసారైనా అన్నప్రసాద వితరణ చేసి అన్నపూర్ణాదేవి ఆశీస్సులను పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ ఆలయ అర్చకులు జి.చంద్రమౌళీశ్వర శర్మ, సాయికృష్ణ, శ్రీ వేంకటేశ్వర సేవా సంఘం ప్రతినిధులు ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తలు ఎన్నికలకు సమాయత్తం కావాలి

అనంతగిరి: అనంతగిరి మండల కేంద్రంలో, సోమవారం ఇప్పటి నుండే కార్యకర్తలు ఎన్నికలకు సమాయత్తం కావాలని అరకు లోయ నియోజవర్గం తెలుగుదేశం పార్టీ నాయకులు, సియ్యారి దొన్నదొర, పిలుపునిచ్చారు నియోజవర్గ మండల స్థాయి నాయకులు గ్రామ స్థాయి నాయకులు ప్రతి ఒక్కరు పార్టీ కోసం కష్టపడి పని చేయాలని తెలుగుదేశం పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్క కార్యకర్త సంసిద్ధం కావాలని సిపాయిలా అనునిత్యం కష్టపడి పనిచేయాలని సోమవారం అనంతగిరి కాఫీ హౌస్ లో నిర్వహించిన తెలుగుదేశం పార్టీ సమావేశంలో వారు అన్నారు అలాగే వైఎస్సార్ ప్రభుత్వం ప్రచార ఆర్భాటం తప్ప అభివృద్ధి శూన్యం అని వారు ఎద్దేవా చేసారు ఇసుక కొరతతో భవన కార్మికులు విలవిలలాడు తుంటే కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటున్న వైఎస్ఆర్ పార్టీ నాయకులు నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారని కనీసం బలిగొన్న వారికి పరామర్శ కూడా చేయలేదని వారు అన్నారు,మన రాష్ట్రంలో అభివృద్ధికుంటు పడిందని వారన్నారు. ఈ కార్యక్రమంలో అనంతగిరి మాజీ జెడ్పిటిసి కొట్యాడ అప్పారావు, తెలుగుదేశం పార్టీ నాయకులు, జన్ని అప్పారావు ,దొన్ను, అంటిపర్తిబుచ్చిబాబు, తడబరిక ఆనంద్ ,శిరగం రామునాయుడు, పుష్పానందం , జోగులు నియోజకవర్గ నాయకులు కమిడి సుబ్బారావు ,వంతల నాగేశ్వరరావు మరియుమండలంలోగల తెలుగుదేశంపార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య సేవలు



భీమునిపట్నం: స్థానిక కలిగొట్ల స్నిగ్ధశ్రీదేవి ఆధ్వర్యంలో ఉచిత హోమియో శిబిరం నిర్వహించారు. ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ చంద్రమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హోమియో డాక్టర్లు జగన్నాథ రావు, మోహన్ రావు సుమారు 180 మంది రోగులను పరీక్షించి వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పౌండేషన్ ప్రతినిధులు సి.హెచ్. చంద్రశేఖర్, కె.శ్రీనివాసరావు, ఎం.శంకర్రావు, వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## సామూహిక వన భోజనాలు

భీమునిపట్నం: భీమిలి మండలం చిప్పాడ పంచాయతీ లోని వినాయకవనంలో 14 గ్రామాల ప్రజలతో సామూహిక వనభోజనాలు జరిగాయి. వీరందరూ ముందుగా వనంలో పూజలు ప్రారంభించారు. వినాయకుడి గరికపూజతో ప్రారంభమై,విష్ణు మూర్తికి తులసీదళంతో, అదేవిధంగా శివునికి ఆయనకు ఎంతో ప్రీతిపాత్రమైన మారేడు దళాలతోను పూజలు నిర్వహించారు. గోమాత కు పూజలు నిర్వహించారు. సాయంత్రం త్రిమూర్తుల పూజ కూడా నిర్వహించారు. వినాయకవనం ఉత్సవ కమిటీ అనంతరం కుల,మతాల బేధం లేకుండా సామూహికంగా వంటలు చేసి,అందరూ భోజనాలు చేసారు. పంచాయతీ కి చెందిన 4వేలమంది ఈ కార్యక్రమంలో పాల్గోవడం విశేషం. ఈ కార్యక్రమం విజయవంతం కావడం నిజంగా సంతోషంగా ఉందని నిర్వాహకులు తెలిపారు.

## అంగరంగ వైభవంగా అయ్యప్ప అంబలం పూజ



భీమునిపట్నం: స్థానిక చిన్న బజార్ లో. ఆదివారం రాత్రి శ్రీ తత్వమసి జ్ఞాన పీఠం ఆధ్వర్యంలో రాజా స్వామి పీఠం స్వాములు అంగరంగ వైభవంగా స్వాములు అంబలం పూజ నిర్వహించారు. అయ్యప్ప స్వాములు అయ్యప్ప స్వామి ని భక్తి శ్రద్ధలతో పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడిదం. సన్యాసిరాజు గురు స్వామి బృందం భక్తి పాటలు స్వాములను భక్తులను అలరించాయి.

## సత్యదేవుని సన్నిధిలో ఎన్.యస్.యస్ విద్యార్థుల సేవలు



అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివారి సన్నిధిలో కార్తీకమాసము సందర్భంగా శ్రీ సత్యదేవ జూనియర్ కాలేజీ ఎన్.యస్.యస్ మరియు ఎన్.సి.సి విద్యార్థులు ప్రోగ్రామ్ ఆఫీసర్ గంటసాల.వెంకట్ ఆధ్వర్యంలో సత్యదేవుని సేవలో భక్తులకు వివిధ విభాగాలలో తమ సేవలు అందించారు.

# అమ్మఒడి కార్యక్రమం అవగాహన

కోటవురట్ల: మండల విద్యాశాఖాధికారి డివిడి.ప్రసాద్ అధ్యక్షతన సోమవారం అమ్మఒడి కార్యక్రమాలపై మండల వనరుల కేంద్రం వద్ద మండలంలోని అన్ని యాజమాన్యాలు పాఠశాలలు, కళాశాలల ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఇఒ ప్రసాద్ మాట్లాడుతూ అమ్మఒడి పథకం 1వ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. సదరు కుటుంబం బిపిఎల్‌కు చెందిన వారై ఉండాలన్నారు. విద్యార్థికి 31.12.2019 నాటికి తప్పనిసరిగా 75 శాతం హాజరు ఉండాలన్నారు. కుటుంబంలో ఎంత మంది విద్యార్థులున్న రూ.15వేలు మాత్రమే తల్లి ఖాతాలో జమ అవుతాయన్నారు. ప్రత్యేక అవసరాల గల పిల్లలకు 75 శాతం హాజరు పరిగణనలోనికి తీసుకోవాల్సిన అవసరం లేదని వివరించారు. తల్లి లేని పక్షంలో తండ్రి లేదా గుర్తింపు పొందిన సంరక్షకుని ఖాతాలో సొమ్ము జమా చేయడం జరుగుతుందని చెప్పారు. తల్లి, తండ్రి లేదా సంరక్షకుని బ్యాంకు ఖాతాను తప్పనిసరిగా ఆధార్ అనుసంధానం చేసుకోవాలన్నారు. పాఠశాలల చైల్డ్ ఇన్‌ఫోలోని వివరాలు 19వ తేదీ 5 గంటల లోపు పూర్తి చేయాలని అన్నారు. 19న సాయంత్రం 8 గంటలకు ఏపి ఆన్‌లైన్ నుండి ఎపిసిఎఫ్ఎస్ఎస్‌కు మొత్తం డేటా బదిలీ చేయడం జరుగుతుందన్నారు. ఎపిసిఎఫ్ఎస్ఎస్ వారు ఈ చైల్డ్ ఇన్‌పో డేటాను ప్రజాసాధికార సర్వే డేటాతో సరిపోల్చి ఫారం-1, ఫారం-2, ఫారం-3 రూపంలో విభజన చేసి ప్రధానోపాధ్యాయుని ఆన్‌లైన్‌కు ఈ నెల 21న పంపబడుతుందన్నారు. ప్రధానోపాధ్యాయుడు సదరు మూడు ఫారంను వెరిఫికేషన్ చేసి 24వతేదీన గ్రామ సచివాలయ వెల్ఫేర్‌కి ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌కు పంపాలన్నారు. గ్రామ సచివాలయ వెల్ఫేర్‌కి ఎడ్యుకేషన్ అసిస్టెంట్ సదరు మూడు ఫారాలకి ప్రింట్ తీసి ఫారం-1ను సచివాలయంలో ప్రదర్శించి అభ్యంతరాలు స్వీకరించాలన్నారు. ఫారం-2, ఫారం-3లను గ్రామ వాలంటీర్లకు ఇచ్చి వెరిఫికేషన్ చేయించాలన్నారు. గ్రామ వాలంటీర్లు, వెరిఫికేషన్ పూర్తన తర్వాత సదరు వివరాలను గ్రామసభ ఆమోదం పొందిన తర్వాత మండల విద్యాశాఖాధికారికి సమర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని 39 ప్రాథమిక పాఠశాలలు, 10 ప్రాథమికోన్నత పాఠశాలలు, 5 ఉన్నత పాఠశాలలు, 1 కేజిబివి, 1 జూనియర్ కళాశాల, 12 ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



## 22న శివపార్వతుల కళ్యాణం

కోటవురట్ల: కోటవురట్ల మండలం పాములవాక సమీపన ఉన్న పట్టాలమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో ఈ నెల 22న శివ పార్వతుల కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నామని ఆలయ ధర్మకర్త వెంకటరమణ తెలిపారు. కార్మిక మాసం సందర్భంగా దీనిని చేపడుతున్నామన్నారు. దీనిలో భాగంగానే భారీ అన్న సంతర్పణ కార్యక్రమాన్ని చేస్తామన్నారు. సాయంత్రం 5 గంటల మొదలయ్యే శివ పార్వతుల కల్యాణోత్సవంతో పాటు దీపారాధన నిర్వహిస్తామని, భక్తులు తరలిరావాలని కోరారు. భక్తులు అన్ని సదుపాయాలు కల్పించామని వెల్లడించారు. ఎటువంటి ఇబ్బందులు ఎదురుకాకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఈ ఉత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## పెద్దాపురం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 5 ఆర్జీలు

పెద్దాపురం: పెద్దాపురం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 5 ఆర్జీలు కార్యాలయం పరిపాలనా అధికారి చిన్నారావు తెలిపారు. వీటిలో డ్రైనేజీలో పూడిక తీయించి దోమల మందు కొట్టించాలని ఒకటి, సొంత ఇంటిపై తరచూ ఫిర్యాదు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఒకటి,రహదారికి అడ్డుగా ఉన్న విద్యుత్ స్థంబాన్ని తొలగించమని ఒకటి,మున్సిపల్ కుళాయిని తొలగించి డ్రైనేజీ మూసివేయాలని చూస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఒకటి,పట్టాదారు పాసు పుస్తకం రద్దు చేయాలని ఒకటి ఆర్జీలు వచ్చినట్లు ఏవో తెలిపారు.



ఎస్సీ, ఎస్టీ, బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ గంట్యాడ శంకరరావు ఆధ్వర్యంలో దొండపర్తిలో కుట్టుమిషన్ ట్రైనింగ్ సర్టిఫికేట్లు ఇస్తున్న దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఈ కార్యక్రమంలో గంట్యాడ శాంతికుమారి, తదితరులు పాల్గొన్నారు.



కార్తీక సోమవారం పర్వదినం సందర్భంగా పెద్దాపురం రూరల్ మండలం తిరుపతి గ్రామంలో శ్రీ శృంగార వల్లభ స్వామి వారిని దర్శించుకున్న శ్రీ నిమ్మకాయల చినరాజప్ప గారు, శాసనసభ్యులు, పెద్దాపురం నియోజకవర్గం

## స్పందనకు 22 దరఖాస్తులు



నర్సీపట్నం: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక స్పందనలో భాగంగా సోమవారం ప్రజల నుండి 22 అర్జీలు వచ్చాయని ఆర్డీవో కార్యాలయ ఇంచార్జ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి సూర్యనారాయణ తెలిపారు. గొలుగొండ మండలం పాకలపాడు గ్రామానికి చెందిన ఇటంశెట్టి సత్యనారాయణ తన దరఖాస్తులో సర్వే నంబర్ 100-1లో 0.55 సెంట్ల భూమి ఉందని, దానికి పాస్ బుక్ ఇప్పించాలని కోరారు. గొలుగొండ మండలం ఏఎల్ పురం గ్రామానికి చెందిన కురం దాసురాజు తనకు సొంత ఇల్లు లేదని ఇంటి స్థలం ఇప్పించాలని కోరారు. నర్సీపట్నం గురందొరపాలెం గ్రామానికి చెందిన బంతు సాంబమూర్తి తన దరఖాస్తులో సర్వేనెంబర్ 306/5(ఎ)లో తనకు 0.75 సెంట్ల భూమి ఉందని, రోడ్డు విస్తరణలో భాగంగా 0.29 సెంట్ల భూమిని తీసుకున్నారని దానికి పరిహారం ఇప్పించాలని కోరారు.
ఎస్.రాయవరం మండలం గుడివాడ గ్రామానికి చెందిన పి.అప్పలరాజు తన దరఖాస్తులో సర్వే నంబర్ 220లో 1.50 సెంట్ల ప్రభుత్వ మెట్ట భూమి ఉందని, దానిలో 30 సంవత్సరాల నుండి జీడి మొక్కలను సాగు చేసుకుంటున్నామని, మా భూమికి డి పారం పట్టా, పట్టాదారు పాస్ పుస్తకం ఇప్పించాలని కోరారు. నర్సీపట్నం మండలం బి.కొత్తపల్లి గ్రామానికి చెందిన రామాయమ్మ తన దరఖాస్తులో తన కుమారుడు మిలటరీలో పని చేస్తున్నప్పుడు సర్వే నెంబర్ 441-2లో 4.88 ఎకరాల డ్రై భూమిని ప్రభుత్వం వారు మంజూరు చేశారని, సదరు భూమిని అమ్మడానికి నిరభ్యంతర పత్రాన్ని ఇవ్వాల్సిందిగా కోరారు.
నాతవరం మండలం ఎర్రవరం గ్రామానికి చెందిన సబ్బవరపు అప్పలనాయుడు తన దరఖాస్తులో తనకు నాలుగు ఎకరాల భూమి ఉందని, దానికి పట్టాదారు పాస్ పుస్తకం ఇవ్వాలన్నారు. గొలుగొండ మండలం పొగచెట్లపాలెం గ్రామానికి చెందిన గ్రామస్తులు తమ దరఖాస్తులో తమ గ్రామంలో మంచినీటి సమస్య ఎక్కువగా ఉందని, తగు చర్యలు తీసుకొని మంచినీటి సమస్యను పరిష్కరించానలి కోరారు.
ఈ స్పందన కార్యక్రమంలో పంచాయతీ రాజ్, గృహ నిర్మాణం, ఐసిడిఎస్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నీటి కోసం ఖాళీ బిందెలతో మహిళలు ఆందోళన



నర్సీపట్నం: తమ గ్రామంలో నీటి సమస్య వెంటనే తీర్చాలని గొలుగొండ మండలం సాలికమల్లవరం పంచాయతీ శివారు పొగచెట్ల పాలెం మహిళలు ఖాళీ బిందెలతో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం నర్సీపట్నంలో భారీ ఎత్తున ఆందోళన చేశారు. ముందుగా ర్యాలీగా వచ్చి నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ పూర్వం నుండి గిరిజన గ్రామమైన పొగచెట్లపాలెం గ్రామంలో మూడు మంచినీటి బోర్లు ఉన్నప్పటికీ చాలా కాలం నుండి అవి పని చేయలేదన్నారు. గతంలో వాటర్ షెడ్ నిర్మించినా అది కూడా పాడైందన్నారు. రక్షిత మంచినీటి పథకం పేరులో పాత ట్యాంక్‌కు మళ్లించినప్పటికీ మంచినీరు అందించడం లేదన్నారు. ఈ సమస్యపై అనేక సార్లు గ్రామ పాలకులకు, పంచాయతీ కార్యదర్శులకు తెలియజేయడం జరిగిందన్నారు.. స్పందన కార్యక్రమంలో కూడా తెలియజేసినా ఎటువంటి స్పందన లేదన్నారు. పక్కనే తాండవ నదిలో ఉన్న కలుషిత నీరు తాగి రోగాల బారిన పడి ప్రాణాలు కోల్పోవడం జరిగిందన్నారు. కావున తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎఒకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మాకిరెడ్డి రామునాయుడు, జి.గురుబాబు, రైతు సంఘం నాయకులు గోలకొండ నూకినాయుడు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జి.రాధాకృష్ణ, గ్రామ గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## యాంటీ బయోటిక్స్‌పై అవగాహన అవసరం

కాకినాడ: నేడు ఏచిన్నపాటి అనారోగ్యం చేసినా త్వరగా తగ్గాలనే ఉద్దేశ్యంతో యాంటీ బయోటిక్స్ మందులు వాడుతుంటారని, వాటిపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ఫార్మాసిస్ట్ కల్యాణి పేర్కొన్నారు.
బోట్ క్లబ్ ఉద్యానవనంలో వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ఔషధ వారోత్సవాలలో భాగంగా జరిగిన అవగాహనా సదస్సు ఉద్దేశించి మాట్లాడారు.ఏకాస్త తలనొప్పి వచ్చినా, జలుబు చేసినా జ్వరం వచ్చినా యాంటీ బయోటిక్స్ వేసుకోవడం తగదన్నారు. వైద్యులు సూచన మేరకు వాటిని వాడాలన్నారు. అవి అలాగే వాడితే రోగనిరోధక శక్తి తగ్గిపోతుందన్నారు.తద్వారా పెద్ద వ్యాధులు వస్తే యాంటీ బయోటిక్స్ వాడినా ప్రయోజనం ఉండదన్నారు.శరీరం తగిన విధంగా స్పందించదని తెలిపారు.అనంతరం పలువురు రోగులకు బీపీ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్నప్రసాదరవు, సుబ్రహ్మణ్యం, పివి రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

## మూర్ఛ అంటువ్యాధి కాదు

కాకినాడ : మూర్ఛ అంటువ్యాధి కాదని, నాడీ వ్యవస్థ పై ప్రభావం చూపించే వ్యాధి అని డా.గుట్టల లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. బోట్క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ మూర్ఛ వ్యాధి నివారణదినోత్సవం సందర్భంగా జరిగిన అవగాహనా సదస్సులో భాగంగా ఆయన మాట్లాడుతూ మెదడు నుండి వెలువడే ఆదేశాలు విద్యుత్ సంకేతాల రూపంలో నరాల ద్వారా అవయవాలను చేరతాయని,మనిషి అవయవాలు, ప్రవర్తన, ఇలా అన్నింటిలో మార్పులు చోటు చేసుకుంటాయన్నారు. ఈ వ్యాధి స్త్రీ పురుష భేదం లేకుండా ఎవరికైనా రావచ్చునని తెలిపారు.నోటి వెంట చొంగ కారడం, నాలుక కరచుకోవడం వ్యాధి లక్షణాలు అన్నారు. రోగికి దుస్తులు వదులు చేసి గాలి బాగా ఆడేలా చేయాలని సూచించారు. మందులు క్రమం తప్పకుండా వాడితే వ్యాధి నుండి దూరంగా వుండవచ్చునన్నారు.కార్యక్రమంలో అడబాల రత్నప్రసాదరవు, రేలంగి బాపిరాజు, పివి రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

## భూసమస్యలు తక్షణమే పరిష్కరించాలని సత్యాగ్రహం



గొలుగొండ: గొలుగొండ మండలంలో ఎంతో కాలం నుంచి అపరిశ్కృతంగా ఉన్న భూసమస్యలు తక్షణమే పరిష్కరించాలని కోరుతూ సమాచార హక్కు చట్టం ప్రచార ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు జక్కు నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఒక్క రోజు సత్యాగ్రహం కార్యక్రమం సోమవారం గొలుగొండ మండల కార్యాలయం ఎదురుగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.మాకిరెడ్డి హాజరై మాట్లాడుతూ గొలుగొండ మండలంలో ఎంతో కాలం నుంచి సాగు చేసుకుంటున్న సాగుదారులకు పట్టాలు ఇవ్వకుండా అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని, అదే విధంగా పాసు పుస్తకాల్లో అవకతవకలు ఉన్నాయన, వాటిని తక్షణమే పరిష్కరించాలని కోరారు. అనంతరం జిల్లా అధ్యక్షులు నరసింహమూర్తి మాట్లాడుతూ రెవెన్యూ కార్యాలయంలో వివిధ పనుల కోసం ఎంతో మంది వస్తున్నారని, వారి యొక్క సమస్యలు పరిష్కరించడంలో రెవెన్యూ అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. భూసమస్యలు తక్షణమే పరిష్కరించేందుకు తహశీల్దార్ తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు. అంతేకాకుండా ఇటీవల ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన రైతు భరోసా కార్యక్రమంలో ఎంతో మంది రైతులు అన్యాయానికి గురయ్యారని, వారికి పూర్తి హక్కులు, అన్ని పత్రాలు ఉన్నప్పటికీ రైతు భరోసా అందించడంలో అధికారులు విఫలం చెందారన్నారు. ముఖ్యమంత్రి రైతుల శ్రేయస్సు కోసం ఎంతో చేస్తునప్పటికీ కింది స్థాయి అధికారులు మాత్రం స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించకపోతే జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద కూడా కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం ప్రతినిధులు అప్పలకొండ, ఎం.రమణ, కెఎల్ఎన్.మూర్తితో పాటు మహిళా విభాగం నాయకులు రమణమ్మ, లక్ష్మి, మండలంలో వివిధ గ్రామాల నుంచి రైతులతో పాటు కన్వీనర్ పి.బాబురావు పాల్గొన్నారు. .

## పక్కాగా వైయస్సార్ నవశకం సర్వే చేయండి

### ఎంపిడిఒ యాదగిరీశ్వరరావు



నాతవరం: వైయస్సార్ నవశకం సర్వే పక్కాగా చేయాలని ఎంపిడిఒ ఎల్. యాదగిరీశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లతో సమావేశం నిర్వహి ంచారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలు అమల్లో భాగంగా నవశకం పేరిట నిర్వహిస్తున్న అర్హుల ఎంపిక సర్వేను నిష్పక్షపాతంగా నిర్వహించాలన్నారు. ఈ నెల 20 నుంచి సర్వే ప్రారంభించి 30వ తేదీ వరకు జరపాలన్నారు. ప్రతీ రోజు 5 నుంచి 10 కుటుంబాల వివరాలు సేకరించాలని వాలంటీర్లకు సూచించారు. అర్హుల వివరాలను వచ్చే నెల 2 నుంచి 7వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసి, 8వ తేదీన పథకాలు అర్హుల జాబితాను సిద్దం చేసి 9వ తేదీన వివరాలు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. వాటిపై 10వ తేదీ నుంచి 14 వరకు గ్రామ సభలో అభ్యంతరాలు స్వీకరించి, 15, 18 గ్రామాల్లో నిర్వహించే సభల్లో చర్యలు చేపడతామని ఆయన తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసేందుకు ప్రతీ ఒక్కరూ బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. నవరత్నాల్లో ఉన్న రేషన్, ఆరోగ్య శ్రీ, పెన్షన్, విద్యా దీవెన, అమ్మఒడి, టైలర్లు, రజకులు, కాపు నేస్తం, నాయి బ్రాహ్మణులు, అర్చకులు, పాస్టర్లు, ఇతర పథకాలకు సంబంధించి వాలంటీర్లతో సర్వే చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు అంకంరెడ్డి జమీలు, పార్టీ మండల అధ్యక్షులు శెట్టి నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

## పెద్దాపురం శాఖా గ్రంథాలయంలో ఘనంగా 52వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు




పెద్దాపురం: పెద్దాపురం శాఖ గ్రంథాలయంలో జరుగుతున్న గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా 5వ రోజు డా. జోశ్యుల కృష్ణబాబు అధ్యక్షతన కవి సమ్మేళనం ఏర్పాటు చేసారు.
ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయ ఆవశ్యకత ప్రాముఖ్యత గురించి మాట్లాడారు.
ఈ కార్యక్రమంలో పెద్దాపురం గ్రంథ పాలకులు, గ్రేడ్ 1 లైబ్రేరియన్ శ్రీ ఎ.వి.వి సత్యనారాయణ, రికార్డు అసిస్టెంట్ శ్రీమతి వి. సుమతీ దేవి వినియోగదారుల హక్కుల పరిరక్షణ సంఘం అధ్యక్షులు భళ్ళమూడి సూర్యనారాయణ, లావణ్య సి.పి బ్రౌన్ సాహితీ సంస్థ కార్యదర్శి కామవరపు కామేశ్వరరావు, ట్రినిటీ పాఠశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల రావు, ప్రముఖ కవయిత్రి డా. అన్నపూర్ణ, కవులు డా. కాపుగంటి కోటి, రామకృష్ణ శ్రీవత్స, వంగలపూడి శివకృష్ణ తదితరులు పాల్గొని కవితాగానం చేసారు.

## ఆదిత్యలో విజ్ఞాన దాయకంగా ముగిసిన కార్యశాల




గండేపల్లి : సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో స్ట్రక్చరల్ అనాలసిస్ యూజింగ్ అబాకస్ అనే అంశం మీద అధ్యాపకులకు శిక్షణ తరగతులు విజ్ఞాన దాయకంగా ముగిసినట్లు డైరెక్టర్ డా.ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు.ఈ మూడు రోజులు కార్యక్రమంలో వివిధ కళాశాలలకు చెందిన అధ్యాపకులు పాల్గొని అబాకస్ అనే సాఫ్ట్వేర్‌లో నైపుణ్యం సాధించారు.ఈసందర్భంగా జరిగిన ముగింపు కార్యక్రమంలో నైపుణ్యం పొందిన అధ్యాపకులకు సర్టిఫికెట్స్ ప్రధానం చేసారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ డా.వి శ్రీనివాసరావు, డా.ఎస్.రమాశ్రీ,మెకానికల్ విభాగాధిపతి డా.బి.హెచ్.వం ప్రసాద్,డసాల్ట్ సిస్టమ్ మేనేజర్ దినేష్ తేజ్ పాల్గొన్నారు.

## 64 సర్క్యులర్‌ను రద్దు చేయాలని జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడించిన జిల్లా యానిమేటర్లు

కాకినాడ: రాష్ట్రములో 30 వేల మంది యానిమేటర్లకు ఉరితాడుగా ఉన్న 64 సర్కులర్‌ను వెంటనే రద్దు చేయాలని, మాకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ ఆర్పీ,యానిమేటర్ల సంఘం (ఏఐటీయూసీఅనుబంధం) ఆధ్వరంలో సోమవారం వందలాది మంది కలెక్టరేట్‌ను ముట్టడించారు.సుమారు గంటపాటు ధర్నా నిర్వహించగా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి సొమ్మసిల్లి పడిపోయారు.సర్కులర్‌ను రద్దు చేయాలని,ఉద్యోగ భద్రత కల్పించాలని,రాజకీయ వేధింపులు ఆపాలని,ఎఐటియుసి జిందాబాద్ అంటూ పెద్ద ఎత్తున ఉద్యోగులు నినాదాలు ఇచ్చారు.ఈ ధర్నాను ఉద్దేశించి ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు యూనియన్ గౌరవ అధ్యక్షులు తాటిపాక మధు మాట్లాడుతూ రావాలి జగన్ కావాలి జగన్ అంటూ మేము అందరం కూడా గత ఎన్నికల్లో అయనకు ఓట్లేస్తే ఇప్పుడు ఆయన పోవాలి యానిమేటర్లు అంటూ 64 సర్కిలర్ ఇనపపెట్టె నుంచి తీసారని తెలియజేశారు .ముఖ్యంగా గత పాదయాత్ర ఎన్నికల ముందు జగన్ మేము ఆయన్ని కలిసినప్పుడు మా అందరికీ పదివేలు ఇస్తారని హామీ ఇచ్చి ఆమాటను నిలబెట్టుకుని ఇప్పుడు పదివేల రూపాయలు పెంచి మీకు కాదు కొత్తగా వచ్చిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు మాత్రమే అని ప్రభుత్వం చెప్పడం చాలా దారుణమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.అంటే పాతవారు అందరు ఏమి కావాలి గోదావరి జిల్లాలో ఇప్పటికే సుమారు 40 మంది ఉద్యోగులు నుండి తొలగించారని మరోపక్క జిల్లా మంత్రులు ,ఎమ్మెల్యేలు ఏ ఒక్క ఉద్యోగం తీయడం లేదని చెబుతూనే మరోపక్క తొలగించడం అన్యమని ఆవేదన వ్యక్తం చేశారు. ఎప్పుడో 2012లో వచ్చిన 64ఇప్పుడు నుంచి బయటకు తీసి ఆపేరుతో మూడు సంవత్సరాల కాలపరిమితి దాటిన వాళ్లందర్నీ తొలగిస్తానని చెప్పడం అన్యాయమన్నారు.సర్కులర్ రద్దు చేయకపోతే జగన్ ప్రొగ్రమ్‌ను అడ్డుకుంటామని అన్నారు.యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎం.శ్రీదేవి,వర్కింగ్ ప్రెసిడెంట్ గంగాభవాని ఇరువురు మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీకి మా జిల్లాలో ఉన్న యానిమేటర్లు అందరు ఓటు వేశారని కానీ నేడు మమ్మలందరినీ తొలగించడం అన్యాయమన్నారు.ఒక పక్క రాష్ట్రంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో సహా అనేక మంది మంత్రులు యానిమేటర్లు ఒకే ఒక్క ఉద్యోగం తీయడం లేదని చెబుతున్నారని కానీ మీకు నిజంగా ప్రేమ చిత్తశుద్ధి ఉంటే 64 సర్కులర్‌ను రద్దు చేయాలని ఆమె వారు తెలియజేశారు.ఈ జిల్లాలో ఇప్పటికే మా వయస్సు దృష్ట్యా మేము కొత్తగా ఏ ఉద్యోగాలలో లేమని ,ఇప్పుడు పొమ్మంటే ఎక్కడకు




పోవాలని అన్నారు.జగన్ న్యాయం అలోచానా చేసి మా జీవితాల్లో వెలుగులు నింపాలని వారు కోరారు.ఈ విషయంపై రాష్ట్ర సీఎంకు తెలియచేస్తామని పేర్కొన్నారు.దీనిలో ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి తోకలప్రసాద్ ,జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కె .సత్తిబాబు ,పీస్ నారాయణ, లోవరత్నం ,యానిమేటర్లు నాయకులు కె .కనక ,కె.వరలక్ష్మి ,దుర్గ భవాని ,ఈశ్వరి ,వెంకట లక్ష్మి ,జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## నాటుసారా స్వాధీనం



కాకినాడ : ఆబ్కారీ మద్యనిషేధ శాఖ జరిపిన దాడులలో నాటుసారా స్వాధీనం చేసుకున్నామని ఆ శాఖ కాకినాడ (సౌత్) ఇన్స్పెక్టర్ఎంవివిబి.కుమార్ వెల్లడించారు.సోమవారం జరిపిన ఈదాడులలో జి.మామిడాడకు చెందిన దొంగల వీర రాఘవ నుండి 20 లీటర్లు, ఏటిమొగకు చెందిన పెమ్మాడి వీరబాబు నుండి 30 లీటర్లు మొత్తం 50 లీటర్ల నిషేధిత నాటుసారా స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించామని తెలిపారు.ఏక్టివా 125 సీసీ వాహనం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దాడుల్లో సిబ్బంది ఎండి.వలి తదితరులు పాల్గొన్నారు.

# నవరత్నాలు గురించి గవర్నర్‌కు వివరణ

## - గవర్నర్‌ను కలిసిన - సీఎం వైఎస్ జగన్ దంపతులు





విజయవాడ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన సతీమణి భారతీరెడ్డి సోమవారం గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం మధ్యాహ్నం మర్యాద పూర్వకంగా జరిగిన ఈ సమావేశంలో విభిన్న అంశాలు చర్చకు వచ్చాయి. తాజా రాజకీయ పరిస్థితులను గవర్నర్ బిశ్వ భూషణ్ హరిచందన్ కు వివరించిన సిఎం, అతి త్వరలో అసెంబ్లీ సమావేశాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాల పేరిట ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను గురించి ముఖ్యమంత్రి వివరించారు. ముఖ్యమంత్రి దంపతుల గౌరవార్థం గవర్నర్ దంపతులు ప్రత్యేకంగా రాజ్ భవన్‌లో భోజన ఏర్పాట్లు చేయించారు. తొలుత రాజ్ భవన్‌లో గవర్నర్ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా, సంయుక్త కార్యదర్శి అర్జునరావు, ఇతర అధికారులు ముఖ్యమంత్రి జగన్‌ను స్వాగతించారు.

గవర్నర్ శాలువా, మెమెంటోలతో ముఖ్యమంత్రిని గౌరవించగా, ముఖ్యమంత్రి సైతం అదే తీరుగా గవర్నర్‌ను సత్కరించారు.

సీఎం జగన్ వెంట ముఖ్యమంత్రి కార్యక్రమాల కమిటీ ఛైర్మన్ తలశిల రఘురాం, ముఖ్యమంత్రి కార్యదర్శి ధనుంజయ రెడ్డి, ఇతర అధికారులు ఉన్నారు.

# తొందరపడి చట్టాలను ఆమోదించకండి

## - మాజీ ప్రధాని



హైదరాబాద్: రాజ్యాంగ వ్యవస్థను పర్యవేక్షించడంలో రాజ్యసభ కీలక పాత్ర పోషిస్తుందని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తన స్టేట్‌మెంట్‌లో పేర్కొన్నారని మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అన్నారు. రాజ్యసభ 250వ సెషన్ సందర్భంగా సోమవారం మన్మోహన్ సింగ్ రాజ్యసభలో మాట్లాడారు. తొందరపడి ఎటువంటి చట్టాలను ఆమోదించకుండా చూసుకునే బాధ్యత ఎంపీలపై ఉందని మాజీ ప్రధాని అన్నారు. భావోద్వేగంగా కూడా ఎటువంటి చట్టాలను చేయరాదన్నారు. కేంద్ర, రాష్ట్ర సంబంధాలపై చర్చలు చేపట్టేందుకు రాజ్యసభ కొంత సమయం కేటాయించాలని సూచించారు. రాజ్యసభ పర్మనెంట్ హౌజ్ అని, ప్రతి జనరల్ ఎలక్షన్ తర్వాత దీన్ని మళ్లీ స్టార్ట్ చేయాల్సిన అవసరం లేదన్నారు. చట్టాల రూపకల్పనలో రాజ్యసభ పటిష్టంగా పనిచేస్తోందన్నారు. అనేక చట్టాలకు సవరణలు, కొత్త విషయాలను చేర్చడంలో రాజ్యసభ దోహదపడిందన్నారు. ప్రజలకు రాజ్యసభ ఉపయోగకరంగా ఉంటుందని తొలి ఛైర్మన్ సర్వేపల్లి రాధాక ృష్ణన్ చెప్పారని గుర్తుచేశారు. రాజ్యసభ నుంచే పార్లమెంటుకు ఎంపికైన మన్మోహన్ సింగ్ తన అనుభవాలని గుర్తు చేస్తుకున్నారు. ప్రతిపక్షనేతగా, ప్రధానిగా అనేక అంశాలపై రాజ్యసభలో ప్రసగించినట్లు ఆయన తెలిపారు. దేశానికి దిశానిర్దేశం చేయడంలో రాజ్యసభ కీలక పాత్ర పోషించిందని మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అన్నారు.

## రైతులను ఆదుకుంటాం కన్నబాబు

విజయవాడ: చిరు ధాన్యాలు సాగుచేస్తున్న రైతులను ఆదుకుంటామని మంత్రి కన్నబాబు భరోసా ఇచ్చారు. సాగు ఖర్చును పరిగణనలోకి తీసుకుని ధరలు ప్రకటించడానికి.. అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని అధికారులను సీఎం జగన్ ఆదేశించారని తెలిపారు. త్వరలో చిరుధాన్యాలపై ధరల ప్రకటిస్తామని చెప్పారు. మార్కెట్ యార్డుల్లో కనీస సదుపాయాలు ఉండేలా చూడాలని, మార్కెట్ యార్డులను కూడా నాడు-నేడు తరహాలో అభివృద్ధి చేస్తామని కన్నబాబు తెలిపారు.

# శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిరమాసోత్సవాలపై సమన్వయ కమిటీ సమావేశం



విశాఖపట్నం : బురుజుపేటలో వేంచేసియున్న శ్రీ కనకమహాలక్మి అమ్మవారి శ్రీ వికారి నామ సంవత్సర మార్గశిర మాసోత్సవములు 27 నుండి ప్రారంభమగుచున్న సందర్భంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అమ్మ వార్ని దర్శించుకొను భక్తులకు మెరుగైన సౌకర్యములు చేయుటకుగాను వివిధ ప్రభుత్వ శాఖల సహాయ సహకారాలు కోరుచూ కలెక్టరు సమకంలో సమన్వయ కమిటీ సమావేశం కలెక్టర్ ఆఫీసు వారి సమావేశ మందిరంలో సోమవారం ఉదయం జరిగినది.

***సమన్వయ కమిటీ ఛైర్మన్‌గా కలెక్టర్ :***

విశాఖపట్నం కలెక్టర్ వారి కార్యాలయంలో సోమవారం నిర్వహింపబడిన సమన్వయ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ వి.వినయ్ చంద్ అధ్యక్షతన జరిగినది. మార్గశిర మాసోత్సవములు సందర్భంగా సామాన్య భక్తులకు ఇబ్బంది కలగ కుండా అమ్మవారి దర్శనం త్వరగా అయ్యే విధంగా అన్ని ప్రభుత్వ శాఖలు తమ వంతు కృషి చేసి సామాన్య భక్తులకు కూడా శ్రీ అమ్మవార్ని దర్శించుకొని సంతృప్తిగా వెళ్ళ విధంగా కృషి చేయాలని అధికారులకు కలెక్టర్ వి.వినయ్ చంద్ సూచించారు. ఈ సందర్భంగా కార్యనిర్వాహణాధికారి ఎస్.వి.ఎస్.ఎన్. మూర్తి మాట్లాడుతూ, అమ్మవారి మార్గశిర మాసోత్సవములకు లక్షలాదిగా భక్తులు వచ్చేదరు. కావున ఈ ఉత్సవములు విజయవంతంగా నిర్వహించి భక్తులకు మెరుగైన సౌకర్యములు కలుగ జేయుటకు అన్నీ ప్రభుత్వరంగ సంస్థల అధికారులు అంకితభావంతో పనిచేసే ఈ ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించుటకు ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందజేయమని కోరియున్నారు. వివిధ శాఖల అధికారులు ప్రతి సంవత్సరం మాదిరిగానే వారి సహాయ సహకారాలు అందించి ఉత్సవములు విజయ వంతము చేయుదమని తెలియపర్చినారు.

కార్యాలయంలో జరుపబడిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి, దేవస్థాన అధికారులు, ఎడిషనల్ డిప్యూటీ కమీషనర్ ఆఫ్ పోలీస్, ట్రాఫిక్, విశాఖపట్నం అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ పోలీస్, స్పెషల్ బ్రాంచ్, విశాఖపట్నం , అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ పోలీస్, లా ఆర్డర్, జోనల్ కమీషనరు. గ్రేటర్ విశాఖ మునిసిపల్ కార్పరేషన్, విశాఖపట్నం మరియు వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.

# బోబ్డే ముందుకు చిదంబరం బెయిల్ పిటిషన్

న్యూఢిల్లీ: ఐఎన్ఎక్స్ మీడియా మనీలాండరింగ్ కేసులో తనకు హైకోర్టు బెయిల్ నిరాకరించడాన్ని సవాలు చేస్తూ కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి పి.చిదంబరం సోమవారంనాడు సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. నూతన సీజేఐగా ఇవాళ ప్రమాణస్వీకారం చేసిన జస్టిస్ బాబ్డే సారథ్యంలోని డివిజన్ బెంచ్ ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించింది. తన క్లయింట్ సుమారు 90 రోజులుగా జైలులోనే ఉన్నారని చిదంబరం తరపు న్యాయవాది కపిల్ సిబల్ కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. 'మేము చూస్తాం' అని ఈ సందర్భంగా ధర్మాసనం పేర్కొంది. సీజేఐ బాబ్డే నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం లేదా బుధవారంలో దీనిపై వాదనలు విననుంది. ఈడీ దాఖలు చేసిన కేసులో చిదంబరం బెయిలు అభ్యర్థనను ఢిల్లీ హైకోర్టు గత శుక్రవారంనాడు తోసిపుచ్చింది. ఆయనపై ఉన్న ఆరోపణల తీవ్రత దృష్ట్యా బెయిల్ నిరాకరిస్తున్నట్టు కోర్టు పేర్కొంది

## బొగ్గు శ్రీను స్వామి 18వ సం. పడి సందర్భంగా

# అంగరంగ వైభవంగా అయ్యప్ప స్వామి అంబళం పూజ

విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన అయ్యప్ప స్వామి

అలరించిన కృష్ణ స్వామి (ఆంధ్ర జేసుదాసు) అయ్యప్ప గీతాలు

భారీ సంఖ్యలో హాజరైన అయ్యప్ప స్వాములు





కంచరపాలెం : విశాఖ ఉత్తర నియోజకవర్గం 37వ వార్డు జై భారత్ నగర్, బర్మా క్యాంపు లో బొగ్గు శ్రీను మిత్రమండలి ఆధ్వర్యంలో బొగ్గు శ్రీను స్వామి 18వ సం, పడి సందర్భంగా అంగరంగ వైభవంగా అయ్యప్ప స్వామి అంబళ0 పూజ నిర్వహించారు. వివిధ దేవాలయలనుండి వచ్చిన వేదపండితుల పర్యవేక్షణలో అయ్యప్ప స్వామి అంబలం పూజలు నిర్వహించడం జరిగింది. వివిధ ఫల పుష్పాదులతో అయ్యప్పను అలంకరించి పంచామృతాలతో అభిషేకించారు. ఈ కార్యక్రమంలో బొగ్గు శ్రీను స్వామి మాట్లాడుతూ అయ్యప్పస్వామికి సేవ చేయడం పూర్వజన్మ సుకృతం అన్నారు. పూజ్య గురువర్యులు విశాఖ శ్రీ శారదా పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి మహా స్వామి వారి దివ్య ఆశీస్సులతో నేను ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడుతున్నానని, అయ్యప్ప మాలను ప్రతీ ఏటా ధరిస్తూ తనవంతు సహాయంగా భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్విరామంగా మాల ధరించిన అన్ని రోజులూ నిర్వహిస్తున్నానని అన్నారు. తనకు ఈ మహద్భాగ్యాన్ని కల్పించిన పెద్దలకు , పూజ్యులకు తన పాదాభివందనాలు తెలియజేసుకుంటున్నానని అన్నారు. మున్ముందు కూడా అయ్యప్ప కరుణా కటాక్షాలతో మరిన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించేందుకు స్వామి ఆశీస్సులు కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా ఆంధ్రా జేసుదాసు తాటిపాక కృష్ణ గురుస్వామి గానామృతంతో అయ్యప్ప గీతాలను ఆలపించి భక్తులను అలరించారు. అనంతరం కృష్ణ గురుస్వామిని బొగ్గు శ్రీను స్వామి సత్కరించారు. ఈ కార్యక్రమానికి పూర్తి సహాయ సహకారాలు అందజేసిన శ్రీ రామ వినాయక అసోసియేషన్ సభ్యులు పుక్కళ్ల ప్రసాద్, పిల్లి రాజు మరియు యూత్ సభ్యులకు, జై భారత్ నగర్ గ్రామ ఉపాధ్యక్షుడు శివ అప్పారావు, మరియు గ్రామస్తులకు బొగ్గు శ్రీను మిత్రమండలి సభ్యులు దీనబంధు, విజయవాడ శ్రీను మరియు మిత్రమండలి సభ్యులు తన ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.




# నావికాదళ అధికారులకు వర్సిటీలో శిక్షణ



విశాఖపట్నం : భారత నావికాదళంలో పనిచేస్తున్న కమీషన్డ్ ఆఫీసర్స్‌కు అవసరమైన నూతన కోర్సులను నిర్వహిస్తామని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం తన కార్యాలయంలో తూర్పు నావికాదళం సీనియర్ స్టాఫ్(ఎడ్యుకేషన్) కెప్టెన్ అనీల్ ఖమానీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాద రెడ్డి మాట్లాడుతూ వర్సిటీలో త్వరలో నేవీ అధికారులకు సైబర్ సెక్యూరిటీ, ఇంటర్నేషనల్ లా, అడ్వాన్స్డ్ స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్ సర్టిఫికేట్ కోర్సులను నిర్వహిస్తామన్నారు. విశ్వవిద్యాలయం నావికాదళ అధికారుల సేవలను, నిపుణతను ఉపయోగించు కుంటుందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.క్రిష్ణమోహన్,, ఉజ్వల్ కుమార్ ఘటక్ తదితరులు పాల్గొన్నారు.

# పార్లమెంటులో గళం విప్పుతాం

## పార్లమెంట్ సమావేశాలకు బయలుదేరిన ఐదుగురు ఎంపీలు
## విశాఖ ఎయిర్ పోర్ట్ నుంచి వీడ్కోలు పలికిన పార్టీ శ్రేణులు



విశాఖపట్నం : ప్రత్యేక హోదా సాధన, పోలవరం నిధుల కేటాయింపు, ఆయా పార్లమెంట్ పరిధులలో అభివృద్ధికి కేంద్రం నుంచి రాబట్టేలా గళం విప్పుతామని వై ఎస్ ఆర్ సిపి ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, గొడ్డేటి మాధవి, బెల్లాన చంద్ర శేఖర్, వంగా గీత, సంజీవ్ కుమార్‌లు అన్నారు. న్యూఢిల్లీలో జరిగే పార్లమెంట్ సమావేశాల్లో పాల్గొనేందుకు సోమవారం వారు ఢిల్లీ పయనమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ అధినేత ,ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి సూచనల మేరకు పార్లమెంట్ సమావేశాల్లో రాష్ట్ర సమస్యలను గట్టిగా ప్రస్తావిస్తామన్నారు. ఈ క్రమంలో నగర పార్టీ శ్రేణులు ఎంపీలకు ఘన వీడ్కోలు పలికారు.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com